




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 202 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | శనివారం 28 మార్చి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :202 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | SAT 28 MARCH 2026 | PRICE : 1/- RS


Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## ఇరాన్‌తో యుద్ధంలో మేం పూర్తిగా గెలిచాం

- ఇరాన్‌పై యుద్ధంలో పూర్తిగా గెలిచామని ప్రకటించిన ట్రంప్
- ఇరాన్ సైనిక శక్తిని దాదాపు నాశనం చేశామని వెల్లడి
- చర్చల కోసం ఇరాన్ కోరిక మేరకు 10 రోజుల గడువు ఇచ్చినట్లు స్పష్టం
- ఒప్పందం కుదరకపోతే విద్యుత్ ప్లాంట్లపై దాడి చేస్తామని హెచ్చరిక
- అణ్వాయుధం చేజిక్కించుకోకుండా ఇరాన్‌ను అడ్డుకున్నామని వ్యాఖ్య

మిగతా 2లో



# కమణీయం సీతారాముల కల్యాణం

భక్తజనసంద్రమైన భద్రాచలం


మిలమిల మెరిసిపోయిన మిథిలా స్టేడియం

పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు

సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

వివరాలు 2లో..





## బాలరాముడికి సూర్య తిలకం

- అయోధ్యలో అద్భుత దృశ్యం
- స్వామివారి నుదుటిని తాకిన కిరణాలు
- అంబరాన్నంటిన శ్రీరామనవమి వేడుకలు

## కఠిన సమయాల్లోనే నాయకత్వ పటిమ తెలుస్తుంది

### ప్రధాని మోదీపై చంద్రబాబు ప్రశంసలు


- పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపు
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రశంసల వర్షం
- సామాన్యుడికి మేలు చేసే నిర్ణయమన్న ముఖ్యమంత్రి
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ట్వీట్‌ను రీపోస్ట్ చేసిన చంద్రబాబు



పెన్ పవర్ డెస్క్:పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకు న్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు. ఇది ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న బలమైన నిర్ణయమని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ట్వీట్‌ను చంద్రబాబు తన సోషల్ మీడియా ఖాతాలో రీపోస్ట్

మిగతా 2లో

## నాపై హత్యాయత్నం జరిగింది



- ఆకివీడులో రామాలయం వద్ద రఘురామపై దాడికి యత్నం
- ఇది ముందస్తుగా ప్లాన్ చేసిన హత్యాయత్నం అన్న రఘురామ
- వేరే మతం ముసుగులో ఉన్నవారు దాడి చేశారని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:శ్రీరామనవమి పర్వదినాన ఆకివీడులోని పెదపేట రామాలయం వద్ద ఓ వర్గానికి చెందిన వ్యక్తులు ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై దాడికి యత్నించిన సంగతి తెలిసిందే. ఈ ఘటన ఏపీలో కలకలం రేపింది. ఈ దాడిపై రఘురామ స్పందిస్తూ... తనపై జరిగిన దాడి కేవలం ఆకస్మికం కాదని, అది ముందస్తుగా ప్లాన్ చేసిన హత్యాయత్నం అని ఆరోపించారు. నిన్న సాయంత్రమే బయటి ప్రాంతాల నుంచి కొందరు వ్యక్తులు ఆకివీడుకు చేరుకున్నారని, రాళ్లు, కత్తులు, మేకులతో తనపై దాడి చేసేందుకు వాళ్లు వచ్చారని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో



## ప్రపంచ టెలికాం వ్యవస్థలకు పెనుముప్పు..

### చైనా హ్యాకర్ల కొత్త ఎత్తుగడ

- ప్రపంచ టెలికాం నెట్‌వర్క్‌లే లక్ష్యంగా చైనా హ్యాకర్ల దాడి
- నెట్‌వర్క్‌లలో 'డిజిటల్ స్లీపర్ సెల్స్' తరహా మాల్‌వేర్ చొప్పిస్తున్న వైనం
- బీపీఎఫ్‌డోర్ అనే లినక్స్ ఆధారిత మాల్‌వేర్‌తో రహస్య గూఢచర్యం
- దీర్ఘకాలిక సైబర్ గూఢచర్యమే ప్రధాన లక్ష్యమని వెల్లడి
- సైబర్ సెక్యూరిటీ సంస్థ రాపిడ్7 నివేదికలో కీలక హెచ్చరికలు

మిగతా 2లో



# సీఎంలతో ప్రధాని మోదీ కీలక సమావేశం...

టీమిండియా స్ఫూర్తితో పనిచేయాలని దిశానిర్దేశం

పశ్చిమాసియా సంక్షోభంపై సీఎంలతో ప్రధాని మోదీ సమీక్ష

ఇంధన సరఫరా, నిత్యావసరాలపై రాష్ట్రాల సన్నద్ధతపై చర్చ

ఎన్నికల కోడ్ కారణంగా పలు రాష్ట్రాల సీఎంలు భేటీకి దూరం

చంద్రబాబు, రేవంత్ రెడ్డి తదితర సీఎంలు హాజరు

పెన్ పవర్ డెస్క్:పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన భద్రత, నిత్యావసరాల సరఫరా, రాష్ట్రాల సన్నద్ధతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల

మిగతా 2లో

## ఇరాన్‌పై దాడులు తీవ్రతరం చేస్తాం

### ఇజ్రాయెల్ మంత్రి హెచ్చరిక

- పౌర ప్రాంతాలపై దాడులు వద్దని కోరుతున్నామన్న కాట్జ్
- ఇరాన్ మాత్రం దాడులు ఆపడం లేదని ఆగ్రహం
- అందుకే దాడులు తీవ్రతరం చేస్తామని కాట్జ్ హెచ్చరిక

మిగతా 2లో



## పెట్రోల్, డీజిల్‌పై సుంకాల తగ్గింపు..

### ప్రధాని మోదీకి మంత్రి లోకేశ్ ధన్యవాదాలు

- పెట్రోల్‌పై రూ.10, డీజిల్‌పై పూర్తిగా ఎక్సైజ్ సుంకం రద్దు
- సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరటనిచ్చే నిర్ణయమన్న లోకేశ్
- ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వమని ఎన్డీఏ నిరూపించుకుందని ప్రశంస

పెన్ పవర్ డెస్క్:పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గించడంపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరట



మిగతా 2లో

## వైసీపీ కేంద్ర కార్యాలయంలో శ్రీరామ నవమి వేడుకలు

- సీతారాముల కల్యాణం నిర్వహించిన వైసీపీ నేతలు
- వేడుకల్లో పాల్గొన్న సజ్జల, వెల్లంపల్లి తదితర నేతలు
- శ్రీరాముడు అందరికీ ఆదర్శప్రాయుడు అంటూ జగన్ ట్వీట్

పెన్ పవర్ డెస్క్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల



మిగతా 2లో

## మళ్లీ లాక్‌డౌన్‌పై వదంతులు..

### కేంద్ర మంత్రి కీలక ప్రకటన



- దేశంలో లాక్‌డౌన్ వార్తలు పూర్తిగా అవాస్తవమన్న కేంద్రం
- ఎలాంటి ప్రతిపాదన పరిశీలనలో లేదన్న కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి
- అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ కొరతతో పెరిగిన ఊహాగానాలు
- ప్రధాని వ్యాఖ్యలను తప్పుగా అన్వయించారని ప్రభుత్వ వర్గాల వెల్లడి

పెన్ పవర్ డెస్క్: దేశవ్యాప్తంగా మరోసారి లాక్‌డౌన్ విధిస్తారంటూ సోషల్ మీడియా సహా, కొన్ని వర్గాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## తెలుగు సినీ రంగ అగ్రనటుడు

చిత్తూరు నాగయ్య (1896– 1973) తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయిన మహా నటుడు. భక్తి ప్రధాన పాత్రలు, చారిత్రక, సామాజిక పాత్రల్లో ఆయన అపూర్వమైన ప్రతిభను కనబరిచారు. నటుడిగా, గాయకుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా ఆయన తెలుగు నాట అగ్రశ్రేణి కళాకారుడిగా గుర్తింపు పొందారు. చిత్తూరు నాగయ్య 1896 మార్చి 28న ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా, రేపల్లె గ్రామంలో జన్మించారు. ఆయన అసలు పేరు ఉప్పలదడియం నాగయ్య శర్మ. చిన్ననాట నుండే నాటకాలపై ఆసక్తి పెంచుకున్న నాగయ్య, విద్యాభ్యాసం పూర్తయ్యాక ప్రభుత్వ ఉద్యోగం చేపట్టారు. అయితే, ఆయన హృదయం కళలపైనే ఆసక్తిగా ఉండడంతో, ఉద్యోగాన్ని వదిలేసి నాటక రంగంలో ప్రవేశించారు. సంగీతంపై గాఢమైన ప్రేమ ఉండటంతో కర్ణాటక సంగీతం లో శిక్షణ తీసుకున్నారు. నాగయ్య తన నటనా ప్రస్థానాన్ని నాటకాల ద్వారా ప్రారంభించారు. సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణ తులాభారం, బిల్హ – రంగనాథం వంటి నాటకాలలో ఆయన అద్భుతంగా నటించి, ప్రేక్షకుల అభిమానం పొందారు. ఆయన భావ ప్రదర్శన, సంభాషణా నైపుణ్యం, సంగీత ప్రతిభ నటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నాటక రంగంలో అందరినీ ఆకట్టుకున్న నాగయ్య, సినిమాల వైపు మళ్ళారు. 1937లో "గృహలక్ష్మి" చిత్రంతో నాగయ్య సినీ రంగంలో అడుగు పెట్టారు. ఈ సినిమా ఆయనకు మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. ఆయన ప్రధానంగా పౌరాణిక, భక్తి ప్రధాన, చారిత్రక చిత్రాల్లో గొప్ప పాత్రలు పోషించి, తెలుగు సినిమా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడే స్థాయికి ఎదిగారు. నాగయ్య నటించిన కొన్ని అత్యంత ప్రఖ్యాత చిత్రాలలో...భక్త పోతన (1942)లో పోతనగా ఆయన నటన అపురూపం, త్యాగయ్య (1946)లో త్యాగరాజ స్వామిగా ఆయన జీవించేసినంత గొప్ప నటన, శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం (1939)లో శ్రీవేంకటేశ్వరునిగా విశిష్టమైన నటన మరపు రానివి. అలాగే భక్త రామదాసు (1943)లో భక్త రామదాసుగా నటించి ప్రేక్షకుల గుండెల్లో నిలిచి పోయారు. యోగి వేమన (1947)లో యోగి వేమన పాత్రలో అద్భుతమైన అభినయం చూపారు. స్వర్గసీమ (1945)లో సామాజిక చిత్రంలో కూడా తన ప్రతిభను ప్రదర్శించారు. మల్లీశ్వరి (1951)లో ముఖ్యపాత్ర పోషించి ప్రేక్షకులను మెప్పించారు. దేవదాసు (1953)లో కీలకపాత్ర పోషించి ప్రేక్షకులను అలరించారు."త్యాగయ్య" చిత్రం జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందింది. ఇది భారతీయ సినీ చరిత్రలో తొలి జీవిత చరిత్ర (బయోపిక్) సినిమా గా చరిత్ర సృష్టించింది. నాగయ్య గొప్ప గాయకుడు కూడా. ఆయన తన సినిమాల్లో చాలా పాటలు స్వయంగా పాడేవారు. ముఖ్యంగా భక్తి గీతాలు, కీర్తనలు ఆయన గొంతులో అద్భుతంగా ప్రతిధ్వనించేవి. నాగయ్య నటుడిగా మాత్రమే కాకుండా, దర్శకుడిగా, నిర్మాతగా కూడా గుర్తింపు పొందారు. ఆయన స్వీయ దర్శక త్వంలో "త్యాగయ్య" సినిమాను నిర్మించి, జాతీయ అవార్డు గెలుచు కున్నారు. ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలో సంగీత కారుల జీవితాలను ఆధారంగా తీసుకుని నిర్మించిన తొలి చిత్రం. సినిమారంగంలో గొప్ప స్థాయికి ఎదిగిన నాగయ్య, జీవితాంతం కళా రంగానికి అంకిత మయ్యారు. అయితే, జీవితాంతం సినిమా రంగానికే అంకితమై ఉన్నా, చివరి దశలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనారోగ్యంతో బాధ పడుతూ 1973 డిసెంబర్ 30న, చెన్నైలో మరణించారు. తెలుగు సినిమాకు భక్తి రస ప్రధాన పాత్రలలో మూడో కన్నుగా నిలిచారు. తెలుగు సినిమాను జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ప్రముఖ నటుల్లో ఒకరు. సినిమా ద్వారా సంగీతాన్ని ప్రజలకు చేరువ చేశారు. నేటికీ ఆయన నటన, గానం మనసులో నిలిచేలా ఉంటుంది. చిత్తూరు నాగయ్య తెలుగులో తొలి మహా నటుల్లో ఒకరు. భక్తి ప్రధానమైన పాత్రలతో ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన ఆయన, సినీ రంగంలో తనదైన సుస్థిరమైన స్థానం సంపాదించారు. నటన, సంగీతం, దర్శకత్వం, నిర్మాణం ? ఇలా అనేక రంగాల్లో తనదైన ముద్ర వేసిన ఆయన తెలుగు సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతారు.

# కమణీయం సీతారాముల కల్యాణం

భద్రాచలం: దక్షిణ అయోధ్య భద్రాచలంలోని మిథిలా స్టేడియం లో రాములోరి షెండ్లి వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా శ్రీసీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ సుట్టం పా రంభమైంది. భక్తజనం జయజయధ్వానాల మధ్య సీతమ్మను జగదానందకారకుడైన శ్రీరాముడు వరణ యమాడాడు. అభిజిత్ మూహూర్తంలోమధ్యాహ్నం 12గంటలకు సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్య చారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వ హించారు. ఆలయ అధ్యకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామి అమ్మ వార్త కళ్యాణం కనులారా తిలకించేందుకు లక్షల మంది జనం మిథిలా స్టేడియానికి తరలిరావడం తో పరిసరాలు భక్తజనంతో కిక్కిరిసిపోయాయి. ఆ ప్రాంతమంతా జైశ్రీరామ్' నినాదంతో మార్మోగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి సీఎం రేవంత్ రెడ్డి. గీత దంపతులు వస్త్రాలు, ముత్యాల తలంబ్రా లు సమర్పించారు. ఈ కళ్యాణోత్స వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వ రరావు, పొంగులేటి శ్రీనివాస్రి, అడ్లూరి లక్ష్మణ్,. కొండా సురేఖ. ఎంపీ వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బాలరాముడికి సూర్య తిలకం**

అయోధ్య: బాలరాముడు కొలువైన అయోధ్యలో శ్రీరామ నవమి వేడుకలు అంబరాన్నంటాయి. ఈసందర్భంగా ఆలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృ తమైంది.

మధ్యాహ్నం సరిగ్గా 12గంటలకు స్వామి వారికి సూర్యకిరణాల తో తిలకం దిద్దారు. నాలుగు నిమిషాల పాటు సూర్యకిరణాలు రామ్లల్లా నుదుటిపై ప్రసరించాయి. బాల రాముడి దర్శనానికి దేశనలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో అయోధ్యలోని భవ్య రామ మందిరం భక్తుల తో కిటకిటలాడుతోంది. అంతకుముందు సరయూ నదిలో పుణ్యస్నానాలు చేసి ఆచరించారు. కాగా.. ఇది రామ్లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన వచ్చిన మూడో శ్రీరామ నవమి కావడం గమనార్హం.

# ప్రపంచ టెలికాం వ్యవస్థలకు పెనుముప్పు..

ప్రపంచవ్యాప్తంగా టెలికాం మౌలిక సదుపాయాలే లక్ష్యంగా చైనాకు చెందిన ఓ హ్యాకింగ్ గ్రూప్ అత్యంత ప్రమాదకరమైన సైబర్ దాడులకు పాల్పడుతోందని ఓ నివేదిక సంచలన విషయాలు వెల్లడించింది. ఈ హ్యాకర్లు దీర్ఘకాలిక సైబర్ గూఢచర్యం కోసం టెలికాం నెట్‌వర్క్‌లలోకి రహస్యంగా మాల్‌వేర్‌ను చొప్పిస్తున్నారని సైబర్ సెక్యూరిటీ సంస్థ రాపిడ్7 (ఝుజూఅ౹7) తన నివేదికలో హెచ్చరించింది. ఈ హ్యాకర్లు "డిజిటల్ స్లీపర్ సెల్స్" తరహాలో పనిచేసే అత్యాధునిక టూల్స్‌ను వాడుతున్నారని నివేదిక తెలిపింది. కెర్నల్-స్థాయి ఇంప్లాంట్లు, పాసివ్ బ్యాక్‌డోర్స్ వంటివి నెట్‌వర్క్‌లలో చాలాకాలం పాటు గుర్తించబడకుండా దాగి ఉండేందుకు వీలు కల్పిస్తాయి. తద్వారా, వ్యవస్థలను నిశ్శబ్దంగా పర్యవేక్షిస్తూ, తమ ఉనికి బయటపడకుండా హ్యాకర్లు యాక్సెస్‌ను కొనసాగిస్తారు. ప్రభుత్వ, కీలక కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లపై నిఘా పెట్టడమే వీరి లక్ష్యమని నిపుణులు భావిస్తున్నారు. ఈ దాడుల్లో "బీపీఎఫ్‌డోర్" అనే లినక్స్ ఆధారిత బ్యాక్‌డోర్‌ను ప్రధానంగా ఉపయోగిస్తున్నట్టు రాపిడ్7 గుర్తించింది. ఇది సిస్టమ్ కెర్నల్‌లోనే దాగి ఉంటూ, నెట్‌వర్క్ ట్రాఫిక్‌ను గమనిస్తుంది. డేటా ప్యాకెట్లలో ఒక ప్రత్యేకమైన రహస్య సిగ్నల్ వచ్చినప్పుడు మాత్రమే ఇది యాక్టివేట్ అవుతుంది. సిస్కో, ఫోర్టినెస్, వీఎమ్‌వేర్, ఇవాంటీ వంటి ప్రముఖ కంపెనీల సిస్టమ్స్‌లోని లోపాలను హ్యాకర్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.కేవలం ఒక్కో సిస్టమ్‌ను హ్యాక్ చేయడమే కాకుండా, టెలికాం నెట్‌వర్క్‌లకు గుండెకాయలాంటి కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై పట్టు సాధించడమే ఈ ఆపరేషన్ లక్ష్యమని నివేదిక స్పష్టం చేసింది. కమ్యూనికేషన్ వ్యవస్థల వెన్నెముకనే లక్ష్యంగా చేసుకోవడం వల్ల ఈ దాడులు అత్యంత ప్రమాదకరమని సైబర్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో డేటా ప్రవాహాన్ని పర్యవేక్షించడం, సేవలకు అంతరాయం కలిగించడం వంటివి చేసే అవకాశం హ్యాకర్లకు లభిస్తుంది.

# ఇరాన్‌తో యుద్ధంలో మేం పూర్తిగా గెలిచాం

ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా "పూర్తిగా గెలిచింది" అని, ఆ దేశ సైనిక సామర్థ్యాన్ని దాదాపు నాశనం చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. అయితే, తదుపరి చర్యలకు ముందు చర్చల కోసం టెహ్రాన్‌కు 10 రోజుల గడువు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఫాక్స్ న్యూస్ ఛానెల్‌కు ఫోన్‌లో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.అమెరికా సైనిక చర్యలతో ఇరాన్ యుద్ధం చేసే సత్తాను కోల్పోయిందని ట్రంప్ అన్నారు. "మేం ఇప్పటికే యుద్ధం గెలిచాం. సైనికపరంగా ఇరాన్‌ను పూర్తిగా ఓడించాం" అని స్పష్టం చేశారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేనను దెబ్బతీశామని, చాలా వరకు క్షిపణులను, వాటి ప్రయోగ వ్యవస్థలను, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను కూడా ధ్వంసం చేశామని ఆయన వివరించారు. ఇరాన్ నాయకత్వాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని పేర్కొన్నారు.

అయితే, ఇంతటి తీవ్రమైన వ్యాఖ్యలు చేసినప్పటికీ, ఇరాన్ అభ్యర్థన మేరకే తదుపరి దాడులను వాయిదా వేసినట్లు ట్రంప్ తెలిపారు. "చర్చల కోసం మరికొంత సమయం కావాలని వాళ్లు నన్ను అడిగారు. అందుకే నేను వారికి 10 రోజుల గడువు ఇచ్చాను" అని ఆయన చెప్పారు. ప్రస్తుతం చర్చలు సజావుగానే సాగుతున్నాయని కూడా పేర్కొన్నారు. ఈ చర్చల్లో ఒప్పందం కుదరకపోతే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. "వారు చేయాల్సిన పని చేయకపోతే, నేను వారి పవర్ ప్లాంట్లను నాశనం చేస్తాను" అని తీవ్ర హెచ్చరిక జారీ చేశారు.ఇరాన్ వంటి శత్రు దేశాలు అణ్వాయుధాలు సంపాదించకుండా

నిరోధించడమే తమ లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు. "ఒక ఉన్మాది లేదా పిచ్చి సిద్ధాంతం చేతిలో అణ్వాయుధం ఉండటానికి వీల్లేదు" అని అన్నారు. అమెరికా కనుక దాడి చేయకపోయి ఉంటే, ఈపాటికి ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదించి, దానిని ఉపయోగించి కూడా ఉండేదని అభిప్రాయపడ్డారు. తన చర్యలపై వస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. ప్రపంచంలోనే తమది అత్యంత శక్తివంతమైన సైన్యమని, తమకు ఎవరూ సాటిరారని ట్రంప్ పునరుద్ఘాటించారు.

# సీఎంలతో ప్రధాని మోదీ కీలక సమావేశం...

- మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రులతో వర్చువల్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో... చమురు, గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'టీమ్ ఇండియా' స్ఫూర్తితో సమన్వయంతో పనిచేయాలని ప్రధాని పిలుపునిచ్చారు.అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన నాటి నుంచి పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ సంఘర్షణ ప్రభావం భారత్ ఇంధన దిగుమతులు, ఎరువుల సరఫరా, ఇతర వాణిజ్య కార్యకలాపాలపై పడే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ ఈ సమీక్ష చేపట్టారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా చూడటం, సరఫరా గొలుసును పటిష్ఠపరచడం, నల్లబజారు, కృత్రిమ కొరతను నివారించడం వంటి అంశాలపై ముఖ్యమంత్రులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ సహా పలువురు ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. అయితే, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలులో ఉన్నందున తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు ఈ భేటీకి హాజరుకాలేదు. ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో క్యాబినెట్ సెక్రటేరియట్ విడిగా సమావేశమవుతుందని కేంద్రం తెలిపింది.

# మళ్లీ లాక్‌డౌన్‌పై వదంతులు..

- మొదటి పేజీ తరువాయి

తీవ్రంగా ఖండించింది. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని, ప్రజలు ఆందోళన చెందవద్దని స్పష్టం చేసింది. దేశంలో లాక్‌డౌన్ విధించే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. ప్రజల్లో నెలకొన్న భయాలను తొలగించే లక్ష్యంతో ఆయన ఈ స్పష్టతనిచ్చారు.

"భారత్‌లో లాక్‌డౌన్ విధిస్తారనే వదంతులు పూర్తిగా అవాస్తవం. ప్రభుత్వ పరిశీలనలో అలాంటి ప్రతిపాదన ఏదీ లేదు. ఇలాంటి సమయంలో ప్రజలు ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా, ఐక్యంగా ఉండటం ముఖ్యం. వదంతులు వ్యాప్తి చేసి ప్రజలను భయాందోళనలకు గురిచేయడం బాధ్యతారహితమైన చర్య, హానికరం" అని హర్దీప్ సింగ్ పురి తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ఇంధనం, సరఫరా వ్యవస్థలు, నిత్యావసరాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజలకు ఇంధనం, ఇతర నిత్యావసరాల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన భరోసా ఇచ్చారు.ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ కొరత ఏర్పడుతుందనే ఆందోళనలు, దేశంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా పరిస్థితిపై నెలకొన్న కొన్ని వార్తల నేపథ్యంలో లాక్‌డౌన్ విధించవచ్చనే ఊహాగానాలు మొదలయ్యాయి. దీనికి తోడు 2020లో విధించిన లాక్‌డౌన్‌కు ఆరేళ్లు పూర్తయిన సందర్భం కూడా కావడంతో ఈ ప్రచారం మరింత ఊపందుకుంది.అంతేగాక పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం గురించి ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పార్లమెంటులో మాట్లాడుతూ "సన్నద్ధంగా ఉండాలి" అని చేసిన వ్యాఖ్యలను కొందరు తప్పుగా అన్వయించారు. కోవిడ్ తరహా సన్నద్ధత అంటే పరిపాలనాపరమైన ముందుజాగ్రత్త చర్యలే తప్ప, ప్రజల కదలికలపై ఆంక్షలు విధించడం కాదని ప్రభుత్వ వర్గాలు ఇప్పటికే స్పష్టం చేశాయి. ఈ క్రమంలోనే లాక్‌డౌన్‌పై వస్తున్న అన్ని రకాల ఊహాగానాలకు తెరదించుతూ కేంద్ర మంత్రి తాజాగా ఈ ప్రకటన చేశారు.

# కఠిన సమయాల్లోనే నాయకత్వ పటిమ తెలుస్తుంది

- మొదటి పేజీ తరువాయి

చేస్తూ తన అభిప్రాయాన్ని పంచుకున్నా రు."కఠినమైన, సవా లుతో కూడిన సమయాల్లోనే నిజమైన నాయకత్వ పటిమ బయటప డుతుంది. నేను ఎప్పుడూ చెప్పే మాట ఇదే. ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో భారతదేశం స్థిరంగా ముందుకు సాగుతోంది. అలాంటి నాయకుడు మనకు ఉండటం దేశ ప్రజల అదృష్టం.ఈ రోజు కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం అత్యంత బలమైన, ప్రజా కేంద్రకమైన చర్య. ఆంధ్రప్రదేశ్ తరపున మేం ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. అంతర్జాతీయంగా పెరుగుతున్న ధరల ప్రభావం నుంచి సామాన్యుడిని రక్షించడానికి ఈ నిర్ణయం ఎంతగానో సహాయపడుతుంది.నేడు అనేక దేశాలు తమ పౌరులపై ఇంధన ధరల భారాన్ని మోపుతుంటే, భారతదేశం మాత్రం తన ప్రజలకే ప్రథమ స్థానం ఇస్తూ ప్రత్యేకంగా నిలుస్తోంది. ప్రజల పట్ల ఎన్డీయే ప్రభుత్వానికి ఉన్న తిరుగులేని నిబద్ధతకు ఇదే నిదర్శనం" అంటూ చంద్రబాబు పేర్కొన్నారు.

# నాపై హత్యాయత్నం జరిగింది

- మొదటి పేజీ తరువాయి

వందేళ్ల చరిత్ర ఉన్న ఈ రామాలయాన్ని ఒక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, వారు హిందువులే అయినప్పటికీ వేరే మతం ముసుగులో ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆలయాన్ని శుభ్రం చేయడానికి కూడా వారు అభ్యంతరం చెబుతున్నారని తెలిపారు. దాడి చేసిన వారు రామ భక్తుల వేషంలో ఉండి ఒక్కసారిగా విరుచుకుపడ్డారని, తృటిలో తాను ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నానని వెల్లడించారు. లేనిపక్షంలో పరిస్థితి దారుణంగా ఉండేదన్నారు. ఇలాంటి వికృత చేష్టలను ఆదిలోనే అరికట్టకపోతే అవి సమాజానికి పెద్ద ముప్పుగా మారతాయని రఘురామ హెచ్చరించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించానని, వారిపై పోలీసులు కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఇరాన్‌పై దాడులు తీవ్రతరం చేస్తాం

ఇరాన్‌పై దాడులను మరింత తీవ్రతరం చేస్తామని ఇజ్రాయెల్ మంత్రి కాట్జ్ తెలిపారు. ఈరోజు ఆయన మాట్లాడుతూ, గల్ఫ్, ఇజ్రాయెల్ దేశాల్లో పౌర ప్రాంతాలపై క్షిపణి దాడులు చేయవద్దని తాను, ప్రధాని బెంజామిన్ నెతన్యాహూ ఇరాన్‌ను హెచ్చరించినట్లు తెలిపారు. కానీ ఇరాన్ మాత్రం పౌర ప్రాంతాలపై దాడులు ఆపడం లేదని మండిపడ్డారు. పదేపదే హెచ్చరించినప్పటికీ ఇరాన్ దాడులు ఆపడం లేదని, ఈ నేపథ్యంలో ఆ దేశంపై దాడులను తీవ్రతరం చేస్తామని కాట్జ్ హెచ్చరించారు. ఇరాన్‌లోని మరిన్ని ప్రాంతాలు లక్ష్యంగా దాడులు చేస్తామని పేర్కొన్నారు. ఈ యుద్ధ నేరానికి ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని వ్యాఖ్యానించారు.

**క్షిపణి తయారీ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాం**

టెహ్రాన్‌లోని బాలిస్టిక్ క్షిపణులు, ఇతర ఆయుధాల తయారీ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ఈరోజు తెలిపింది. పశ్చిమ ఇరాన్ ప్రాంతంలోని క్షిపణి ప్రయోగ, నిల్వ కేంద్రాలపై దాడులు చేసినట్లు వెల్లడించింది. కాగా, ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం ప్రారంభమై నాలుగు వారాలవుతోంది. ఈ కాలంలో ఇరాన్‌పై 850కి పైగా తోమహక్ క్షిపణులను అమెరికా ప్రయోగించింది.

# వైసీపీ కేంద్ర కార్యాలయంలో శ్రీరామ నవమి వేడుకలు

- మొదటి పేజీ తరువాయి

అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోన రఘుపతి, మల్లాది విష్ణు, జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.మరోవైపు, వైసీపీ అధినేత జగన్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. "ఇచ్చిన మాట కోసం రాజ్యాన్ని త్యజించి, ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మాన్ని వీడని మహోన్నతుడు శ్రీరాముడు అందరికీ ఆదర్శప్రాయుడు. ఆ సకల గుణాభిరాముడి దివ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని ఎక్స్ వేదికగా ఆయన శ్రీరామనవమి సందేశాన్ని ఇచ్చారు.

# పెట్రోల్, డీజిల్‌పై సుంకాల తగ్గింపు..

- మొదటి పేజీ తరువాయి

కల్పించేలా ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని కొనియాడారు. ఈ మేరకు ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను భారీగా తగ్గించిన ప్రధాని మోదీ గారికి ధన్యవాదాలు. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడకుండా ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయం. పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు రూ.10 తగ్గించారు, డీజిల్ పై పూర్తిగా రద్దు చేశారు. ప్రజలకు ఉపశమనం కలిగించేలా తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రజా సంక్షేమ ప్రభుత్వమని ఎన్డీఏ నిరూపించుకుంది. ఇంధన కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే... పశ్చిమాసియా యుద్ధ ప్రభావం నుంచి ప్రజలకు ఉరటనిస్తూ ఇంధన ధరలు పెరగకుండా భారీగా ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిన ప్రధాని మోదీ గారికి, కేంద్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు" అంటూ సోషల్ మీడియాలో స్పందించారు.

# ప్రతి గ్రామంలోనూ పసుపు జెండా రెపరెపలాడాలి

### టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పిలుపు..



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 27**

ఈ నెల 29వ తేదీన తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గిద్దలూరు నియోజకవర్గంలో పండుగలా నిర్వహించాలని స్థానిక శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగు జాతి గతిని మార్చిన మహోన్నత శక్తి ఎన్టీఆర్ అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త నడుచుకోవాలని కోరారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ, ప్రతి వార్డులోనూ తెలుగు దేశం పార్టీ జెండాను ఘనంగా ఆవిష్కరించి, అన్న నందమూరి తారక రామారావుకు ఘన నివాళులు అర్పిద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.


# పెన్ పవర్

MARKAPURAM మార్కాపురం

## మార్కాపురం - ప్రకాశం


# గంగవర గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా...

## టిడిపి ఇంచార్జ్ గూడూరు ఎలక్షన్ బాబు





**పుల్లల చెరువు పెన్ పవర్ మార్చి 27**

గంగవరం గ్రామాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ గూడూరి ఎరిక్షన్ బాబు ప్రకటించారు.సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.పుల్లల చెరువు మండలం గంగవరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐటీడీఏ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రభుత్వ పనితీరు, భవిష్యత్ అభివృద్ధి కార్యాచరణపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం క్రమంగా నెరవేర్చుతోందని ఎరిక్షన్ బాబు పేర్కొన్నారు. ప్రారంభంలో రూ.3000గా ఉన్న సామాజిక పెన్షన్లను రూ.4000కు పెంచినట్లు, వికలాంగులకు రూ.6000గా ఉన్న పింఛన్లను రూ.10,000కు పెంచినట్లు తెలిపారు. అలాగే ప్రతి నెల 1వ తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందించే విధానాన్ని ప్రవేశపెట్టినట్లు వివరించారు.విద్యా రంగానికి ప్రాధాన్యం ఇస్తూ 'తల్లికి వందనం' పథకం ద్వారా కుటుంబంలో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు.మహిళల సంక్షేమం కోసం సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి కీలక నిర్ణయాలు అమల్లో ఉన్నాయని చెప్పారు.రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యంతో ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఆయన వెల్లడించారు.వ్యవసాయం లాభదాయకంగా మారేందుకు పలు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.యువత ఉపాధిపై దృష్టి పెట్టిన ప్రభుత్వం 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగ అవకాశాలను కల్పించిందని తెలిపారు.గతంలో ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొన్న యువతకు ఇది ఊరటనిచ్చిందన్నారు.మార్కాపురం జిల్లా అభివృద్ధికి కీలకమైన వెలుగొండ ప్రాజెక్టు పూర్తి దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎరిక్షన్ బాబు స్పష్టం చేశారు. గతంలో నిర్మాణ లోపాల వల్ల కాలువలు దెబ్బతిన్నాయని, వాటిపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి, రూ.500 కోట్లతో కాంక్రీట్ పనులు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.త్వరలోనే సాగు, తాగునీటి సమస్యలు పరిష్కారం కానున్నాయని చెప్పారు.గంగవరం గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని ఆయన తెలిపారు. గ్రామంలో సిమెంట్ రోడ్లు, తాగునీటి సౌకర్యం, దళితవాడల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. గ్రామ ప్రజల దీర్ఘకాల డిమాండ్ అయిన ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.మొదటి దశలో రూ.50 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించి, అనంతరం తారు రోడ్ల నిర్మాణం చేపడతామని వెల్లడించారు.గతంలో ఆగిపోయిన రోడ్డు పనులను పునఃప్రారంభించి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గంగవరం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ప్రజల సహకారంతో అన్ని హామీలను నెరవేర్చుతామని గూడూరి ఎరిక్షన్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పోట్ల గోవిందు,మాజీ కన్వీనర్ పల్లపాటి బాదరయ్య, కాకర్ల కోటయ్య, శనగ నారాయణరెడ్డి,ఉప్పల హనుమంత్,గజ్వేల్ భాస్కర్, ఆర్మీ బుజ్జి, టిడిపి మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# కన్నులపండువగా శ్రీ సీతారాముల కళ్యాణం




**కందుకూరు పెన్ పవర్ మార్చి 27**

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కందుకూరు పట్టణంలోని ముదిరాజ్ పాలెంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి ఆలయం వద్ద శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, కన్నుల పండువగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచే ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు, మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో సీతారాముల కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. రంగురంగుల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన కళ్యాణ మండపంలో సీతమ్మ వారు, రామచంద్ర మూర్తిల ఉత్సవ విగ్రహాలను ఉంచి వేద మంత్రాల సాక్షిగా కళ్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకను వీక్షించేందుకు ముదిరాజ్ పాలెం పరిసర ప్రాంతాల నుంచే కాకుండా, పట్టణం నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ముదిరాజ్ పాలెం లోని వీధులన్నీ శ్రీరామ జయరామ నామస్మరణతో మారుమోగాయి. స్థానిక ముదిరాజ్ సంఘం నాయకులు ఆలయ కమిటీ సభ్యులు ఈ వేడుకను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ



కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు వారివారి కుటుంబాలలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, లోకమంతా శాంతిగా ఉండాలని ఆ రామయ్యను ప్రార్థించుకున్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు స్వామివారి అన్న ప్రసాదం మరియు చల్లని పానకం, వడపప్పు, మజ్జిగ పంపిణీ చేశారు, కళ్యాణోత్సవ పిటలపై తగిలాం అరవింద్ - సుప్రజ గార్లు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పట్టాభి రామాలయంలో వైభవంగా రాములోరి కళ్యాణం



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 27**

గిద్దలూరు పట్టణంలో న్యూ బద్వేల్ రోడ్డు లోని శ్రీ పట్టాభి సీతా రామాలయంలో సీతమ్మ , రాములవారి కళ్యాణం నర్సిహశాస్త్రీ శాస్త్రోక్తంగా కమణీయంగా నిర్వహించారు. సరిగ్గా అభిజిత్ లగ్నంలో జీలకర్ర బెల్లం ధారణ చేయించారు. అనంతరం మాంగళ్య ధారణ తలంబ్రాల కార్యక్రమం వేద మంత్రాలనడుమ వైభవంగా జరిగాయి . స్వాములవారి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించారు . స్వామి , అమ్మవారి ప్రవరను అద్భుతంగా వర్ణించారు శాస్త్రి. ప్రతి మంత్రానికి అర్థం వ్యాఖ్యానం చెపుతూ నరసింహ శాస్త్రీ కళ్యాణం కమణీయంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఈ ఆలయంలో సీతా రాముల కళ్యాణ శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించటం ఆనవాయితీ. ఆలయనిర్వహకులు కుందుర్తి బాబు దంపతుల ఆద్వర్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తారు ఈవేడుకల్లో వేలాదిగా పాల్గొని కల్యాణవేడుకలను తిలకించారు . నరసింహ శాస్త్రి వేదమంత్రాలు వల్లిస్తుండగా ఆలయ అర్చకులు రామచంద్ర శాస్త్రి క్రియ తంతును నిర్వహించి రక్తి కట్టించారు. రాములోరి కళ్యాణానికి భక్తులు పట్టు వస్త్రాలను సమర్పించారు. కళ్యాణానికి కళ్యాణం అనంతరం తీర్థప్రసాదాలనొసంగారు ఈ సందర్భంగా భక్తులకు సమారాధన ఏర్పాటు చేశారు.

# మండలంలో పలువురిని పరామర్శించిన బుర్రా మధుసూదన్ యాదవ్





**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 27**

నెల్లూరు జిల్లా కల్చరల్ వింగ్ జిల్లా అధ్యక్షులు కంపరాజు సాంబశివరాజు అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటిదగ్గర ఉన్న సాంబశివరాజును బుర్రా మధుసూదన్ యాదవ్ శుక్రవారం పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మధుసూదన్ యాదవ్ పరామర్శ అనంతరం సాంబశివరాజు తుది శ్వాస విడిచారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని బుర్రా ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని బుర్రా తెలిపారు. సాంబశివరాజు ఆత్మకు ఆ భగవంతుడు శాంతిని కలుగచేయాలని ఆకాంక్షించారు. అనంతరం స్వర్ణాజిపురం గ్రామానికి చెందిన పాలిచర్ల. చిట్టిబాబు, సోని, చైతన్య కుమార్, అవంతిక, మద్దిరాల బుజ్జమ్మ లు ఈ మధ్యకాలంలో ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స అనంతరం కోలుకొని ఇంటికి రాగా, విషయం తెలుసుకున్న బుర్రా మధుసూదన్ వారిని వాళ్ళ ఇళ్లకు వెళ్ళి పరామర్శించినారు. అదేవిధంగా స్వర్ణాజిపురం గ్రామానికి చెందిన జలదంకి ఏసేబు, కొత్తపేట గ్రామానికి చెందిన జాజుల శ్రీను అనువారులు హార్ట్ ఎటాక్ తో మరణించగా వారి కుటుంబాలను పరామర్శించి ధైర్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులతో పాటు , మండల నాయకులు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బస్సు ప్రమాద బాధిత బంధువులకు భోజనలు ఏర్పాటు

## మున్సిపల్ కమిషనర్ నారాయణరావు

**మార్కాపురం టౌన్ పెన్ పవర్ మార్చి 27**

రాయవరం వద్ద చోటు చేసుకున్న బస్సు, టిప్పర్ ప్రమాదంలో 14 మంది మృతి చెందిన సంఘటన తెలిసిందే.వీరి మృతదేహాలను ప్రభుత్వ వైద్యశాల చేర్చి బంధువులకు అప్పగించడానికి డిఎన్ఏ టెస్ట్ కు పంపించడం జరిగింది. మృతుల బంధువులకు, గాయపడిన వారి బంధువులకు, హాస్పిటల్ ముందు భాగంలో మున్సిపల్ కమిషనర్ నారాయణరావు ఆధ్వర్యంలో సుమారు 100 మందికి పైగా, త్రాగునీరు, భోజనాల



విషయంలో ఎటువంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేశారు.

## బస్సు ప్రమాద బాధితురాలికి

# మంత్రుల పరామర్శ

### ఒంగోలు రిమ్స్ లో మణెమ్మను పరామర్శించిన స్వామి, గొట్టిపాటి, ఎమ్మెల్యేలు దామచర్ల, ఇంటూరి, విజయ్ కుమార్

### -బాధితులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ

### -మణెమ్మకు ఆర్థికసహాయం అందించిన నాగేశ్వరరావు





**కందుకూరు పెన్ పవర్ మార్చి 27**

మార్కాపురం వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడి, ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, దామచర్ల జనార్ధన్, బి ఎన్ విజయ్ కుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ షేక్ రియాజ్ లు శుక్రవారం పరామర్శించారు. 13 మంది బాధితులతో మాట్లాడి ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాలెం మండలం అంకభూపాల పురం గ్రామానికి చెందిన బత్తుల మణెమ్మ కూడా ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రిమ్స్ లో చికిత్స పొందుతోంది. రెండు చేతులు విరిగిపోగా, లివర్ కు గాయం కావడంతో ఆపరేషన్ చేశారు. మంత్రులు సహచర ఎమ్మెల్యేలతో కలిసి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆమెను పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. మణెమ్మ భర్త వెంకటయ్యతో మాట్లాడి ఆర్థిక సహాయం అందించారు. మణెమ్మ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ బస్సు ప్రమాదంలో 14 మంది చనిపోవడం అత్యంత బాధాకరమైన సంఘటన అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయపడ్డవారు పూర్తిగా కోలుకునేంతవరకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇలాంటి ప్రమాదం మరోసారి జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెంట అంకభూపాలపురం టిడిపి సీనియర్ నాయకులు పెగడ శ్రీనివాసులు, బండారు సోమరాజు తదితరులు ఉన్నారు.

# రామాలయంలో మంత్రులు, ఎమ్మెల్యేల పూజలు





**కందుకూరు పెన్ పవర్ మార్చి 27**

శ్రీరామనవమి పండుగ సందర్భంగా మద్దిపాడు మండలం సీతా రామపురం గ్రామంలోని రామాలయంలో పలువురు ప్రజా ప్రతినిధులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాన్యూస్ ఛానల్ ఎండి మారెళ్ళ వంశీకృష్ణ ఆహ్వానంతో మంత్రులు శ్రీ డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండితులు నేతలకు వేదమంత్రాలతో ఆశీర్వచనం పలుకగా నేతలందరినీ మారెళ్ళ వంశీకృష్ణ సత్కరించారు.

# వైభవంగా శోభాయాత్ర



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 27**

శ్రీరామ నవమి పర్వదిన సందర్భంగా శ్రీ సీతారామ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. హిందూ దేవాల యాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని రాష్ట్రంలోని హిందూ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని శ్రీ సీతారామ స్వామి దేవాలయం అధ్యక్షులు చీతిరాల నాగార్జున అన్నారు. శుక్రవారం గిద్దలూరు పట్టణంలో శ్రీరామ నవమి పర్వదిన సందర్భంగా శోభాయాత్ర ను ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆదాయం ఉన్న దేవాలయాలు ప్రభుత్వ ఆధీనంలోని ఎండోమెంట్స్ లో కలసిన తరువాత జరగాల్సిన ఉత్సవాలు,పూజలు, కైంకర్యాలు తగ్గిపోతున్నాయని అన్నారు . దేవాలయాల నిర్వహణ కోసం భక్తులు ఇచ్చిన భూములు, ఆస్తులు, ఆభరణాలకు రక్షణ కరువైందన్నారు. దేవాలయాల నిర్వహణ హిందూ మతపెద్దలు, సాధువులకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు ఎస్ వి కృష్ణారావు, సూరే నాగేశ్వరరావు, బంగారు శ్రీనివాసాచారీ, శంకర్, ఎర్రారెడ్డి పలువురు పాల్గొన్నారు.

# పట్టాభి రామాలయంలో వైభవంగా సీతారాముల కళ్యాణం





**పెద్ద దోర్నాల పెన్ పవర్ మార్చి 27**

మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతా రామాలయంలో సీతమ్మ , రాములవారి కళ్యాణం అంగరంగ ఇవ్వంగా శుక్రవారం నిర్వహించారు. ఆధ్వర్యంలో ఉభయ దాతలతో సరిగ్గా అభిజిత్ లగ్నంలో జీలకర్ర బెల్లం ధారణ చేయించారు. అనంతరం మాంగళ్య ధారణ తలంబ్రాల కార్యక్రమం వేద మంత్రాలనడుమ వైభవంగా జరిగాయి . స్వాములవారి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించారు . స్వామి , అమ్మవారి ప్రవరను అద్భుతంగా వర్ణించారు శాస్త్రి. ప్రతి మంత్రానికి అర్ధం వ్యాఖ్యానం చెపుతూ కళ్యాణం కమణీయంగా నిర్వహించారు. ఆనవాయితీ . ఆలయనిర్వహకులు కుందుర్తి బాబు దంపతుల ఆద్వర్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తారు ఈవేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణవేడుకలను తిలకించారు. ప్రేమ సాయి మందిరం కమిటీ వారు దోర్నాల పట్టాభి స్వామి ఆలయం మరియు జమ్మి దోర్నాల రామాలయానికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు ముత్యాలు సమర్పించారు జరిగింది. ఆలయ కమిటీ వారు భక్తులకు పానకం వడపప్పులు పంపించేశారు ఈ కార్యక్రమంలో భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


# అంగరంగ వైభవంగా సీత రాముల కళ్యాణం...

**పుల్లల చెరువు పెన్ పవర్ మార్చి 27**

మండల కేంద్రమైన పుల్లల చెరువు సమీపంలోని చౌటపల్లి గ్రామంలో వెలసిన ప్రసన్న ఆంజనేయ స్వామి భక్తుల కోరికలను తీర్చే కల్పతరువుగా విరాజిల్లుతున్నాడు.దూరదూరాల నుంచి తరలి వచ్చే భక్తులతో ఆలయం నిత్యం కిటకిటలాడుతోంది.పూర్వం పుల్లల చెరువు సమీపంలో చౌటపల్లి గ్రామం ఉండేది.తమిళనాడు రాష్ట్రంలోని పేరంబుదూర్ ప్రాంతానికి చెందిన రామానుజ అయ్యంగార్ అనే బ్రాహ్మణుడికి ఈ ప్రాంతంలోని విస్తారమైన శోత్రియ భూములు చెందినవని స్థానిక పెద్దలు చెబుతుంటారు. చౌటపల్లితో పాటు చాపలమడుగు, ఎర్రగొండపాలెం మండలంలోని నరసాయపాలెం గ్రామాల్లోనూ ఆయనకు భూములు ఉన్నాయని, సుమారు వెయ్యి ఎకరాలకు పైగా ఆస్తి ఉండేదని చెప్పుకుంటారు.కాలక్రమేణా అయ్యంగార్ ఈ ప్రాంతాన్ని విడిచిపెట్టగా, ఆయన సోదరి, బంధువులు ఈ గ్రామాల్లోని భూములను విక్రయించి వెళ్లిపోయినట్లు సమాచారం.అయితే, చౌటపల్లిలోని ప్రసన్న ఆంజనేయ స్వామి విగ్రహాన్ని అయ్యంగార్ కాలంలోనే ప్రతిష్టించినట్లు విశ్వసిస్తున్నారు.అప్పటి నుంచి స్వామివారు భక్తుల కోరికలు తీర్చే దైవంగా పేరు గాంచారు.ప్రతి సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా స్వామివారికి తిరునాళ్ళు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా పండుగ సందర్భంగా తెల్లవారుజామున నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి దర్శనాలు చేసుకున్నారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తలనీలాలు సమర్పించి, పొంగళ్లను నైవేద్యంగా పెట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ పూజారులు కాసులనాటి



ఉమామహేశ్వరశర్మ, శేషఫణి శర్మలు స్వామివారికి అష్టోత్తర శతనామావళి, ఆకుపూజలు, అభిషేకాలు, ఇతర విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.అదే విధంగా పుల్లల చెరువులోని కోదండరామ స్వామి ఆలయం, కమ్మవారిపల్లెలోని పట్టాభిరామస్వామి ఆలయాల్లో కూడా శ్రీ సీతారామచంద్ర స్వాములను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో వీక్షించి తరిచారు.ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రసాదాల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.భక్తులకు విస్తృతంగా సేవలు అందించారు. శ్రీరామనవమి ఉత్సవాలతో మొత్తం ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది.



# బస్సు ప్రమాద బాధితులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి - ఎమ్మార్పీఎస్ డిమాండ్





**మార్కాపురం రూరల్ పెన్ పవర్ మార్చి 27**

మార్కాపురం మండలం రాయవరం సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధితులకు కనీసం రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రమాద స్థలాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి పరిశీలించిన బ్రహ్మయ్య మాదిగ, అనంతరం సమీప ఆసుపత్రికి వెళ్లి గాయపడిన వారిని పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరుతూ, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కర్నూల్‌లో జరిగిన ప్రమాదానికి రూ. 10 లక్షలు, అమలాపురంలో జరిగిన ఘటనకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం, ప్రస్తుతం రాయవరం ప్రమాదంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారు కూలీలు కావడం వల్ల తక్కువగా చూడటం తగదని ప్రశ్నించారు.కూలీల ప్రాణాలకు కూడా సమాన విలువ ఇవ్వాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా అధ్యక్షులు మందాటి పీటర్ మాదిగ, రాష్ట్ర నాయకులు పానుగంటి షాలెం రాజు మాదిగ, జిల్లా నాయకులు కోటి మాదిగ, నేదరపల్లి జయరాజ్ మాదిగ, గోన మోహన్ రావు మాదిగ, భూదాల ఆనంద్ మాదిగ, మహిళా నాయకులు గుర్రం రాణెమ్మ, ప్రియాంక, జయమ్మ, వి హెచ్ పి ఎస్ నాయకులు రాజారావు తదితరులు పాలుగున్నారు.

# ఉచిత మంచినీటి చలివేంద్రం ప్రారంభం




**మార్కాపురం టౌన్ పెన్ పవర్ మార్చి 27**

స్థానిక గడియార స్తంభం సెంటర్ లో రెడ్డి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి అధ్యక్షతన దాతల సహకారంతో మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రావణి చారిటబుల్ ట్రస్ట్ అధినేత్రి డాక్టర్ చపల్లి కనకదుర్గ హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఎన్నో మంచి పనులు చేస్తుందని అదేవిధంగా నేడు చలివేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. డాక్టర్ కనకదుర్గ పేదల కోసం మరెన్నో మంచి కార్యక్రమాలు చేస్తూ ముందుకెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి రెడ్డి సంక్షేమ సేవా సంఘం కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి మాట్లాడుతూ మార్కాపురం పట్టణ ప్రజలకు ఎండాకాలంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం మన సంస్కృతిలో ఒక గొప్ప సేవా కార్యక్రమం అన్నారు. ఈ కాలంలో తీవ్ర ఎండల వల్ల ప్రజలు, ప్రయాణికులు, కూలీలు ఈ చలివేంద్రం ద్వారా చల్లని తాగునీరు, మజ్జిగ, పానకాలు అందించడం వాళ్లకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని చెప్పారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం అనేది కేవలం దాహం తీర్చడం మాత్రమే కాదు, మన మనసులోని మానవత్వాన్ని, దయాగుణాన్ని బయటపెట్టే ఒక మంచి అవకాశం కూడా అన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా చలివేంద్రాల ఏర్పాటులో పాల్గొనాలి కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమల రెడ్డి రామిరెడ్డి ,కుందూరు రమణారెడ్డి ,వెన్న వెంకట్ రెడ్డి, గుంటక భాస్కర్ రెడ్డి, బొమ్మ రెడ్డి సత్యనారాయణ రెడ్డి, గోరంట్ల చిన్న వెంకట్ రెడ్డి. గోలమరి కాశి రెడ్డి,కందుల బలరామిరెడ్డి ,జే.నాగిరెడ్డి, సాదుల యోగి రెడ్డి, ఎర్ర హర్షవర్ధన్ రెడ్డి ,రామకృష్ణారెడ్డి, నాగేందర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# దొనకొండ లో ఉచిత మెగా వైద్య శిబిరం

## రిబ్బన్ కత్తిరించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా నియోజకవర్గ ఇన్చార్జి కైపు వెంకటకృష్ణారెడ్డి.

**దొనకొండ మార్చి 27 పెన్ పవర్**

దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త రాష్ట్ర కేకేసి ఛైర్మన్ కైపు వెంకటకృష్ణారెడ్డి సారథ్యంలో మార్కాపురం కందుల ఓబుల్ రెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో దొనకొండ మండల కేంద్రంలోని రైల్వే కమ్యూనిటీ హాల్ లో ఉచిత మెడికల్ క్యాంపును జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త షేక్ సైదా నేడు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా షేక్ సైదా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సేవభావంతో సామన్య ప్రజానీకానికి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సదుపాయం కల్పించాలని లక్ష్యంతో ఈ ఉచితం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందని వారన్నారు. భవిష్యత్తులో జిల్లాలో అన్ని మండలాల్లో ఇలాంటి ఉచిత మెడికల్ క్యాంపులను కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తుందని వారు తెలిపారు. మార్కాపురం వైద్యులు డాక్టర్ శ్రవం తేజ తనుజ అలెగ్జాండర్ వైద్య సిబ్బంది లావణ్య వెలుగొండ రావు మహిమ కుమార్ ఎలక్షన్ బాబు దివ్య హాస్పిటల్ పిఆర్ఓ అలెగ్జాండర్ ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని రోగులను పరీక్షించి ఉచితంగా దాదాపు 232 మంది పైగా రోగులకు మందులు పంపిణీ చేశారు మన్నించి ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు



చేసినటువంటి హాస్పటల్ సిబ్బందిని ఘనంగా చాలు వాళ్ళతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సమస్త గత ఎన్నికల ఛైర్మన్ బోర్డ్ సతీష్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ ఛైర్మన్ షేక్ సైదా మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని దర్శి నియోజకవర్గ కేకేసి ఛైర్మన్ జయరాం షేక్ గఫూర్ నాగేశ్వరరావు దొనకొండ మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం పాల్గొన్న అన్న రాంబాబు





**మార్కాపురం పెన్ పవర్ మార్చి 27**

శ్రీరామనవమి సందర్భంగా స్థానిక దేవాలయం బజార్ లో శ్రీ సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ ఈ కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైయస్సార్ సిపి నియోజకవర్గ ఇన్చార్జి అన్నా రాంబాబు వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అన్నా రాంబాబు ఆకాంక్షించారు.హిందూ సనాతన సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ వాడవాడలా నిర్వహించబడుతున్న ఇటువంటి ఆధ్యాత్మిక వేడుకలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తున్నాయని పేర్కొంటూ నిర్వాహకులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న .. మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 27**

మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో శ్రీ రామనవమి పండుగ సందర్భంగా శ్రీ. కోదండరామస్వామి 41వ కళ్యాణ మహోత్సవంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామీ వార్లను కదిరి బాబురావు దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో కదిరి ప్రకాశ్ రావు , కదిరి పార్ధసారధి, రక్షిత ఫార్మసి కంపెనీ అధినేత చందనా రామేశ్వర రావు,కదిరి రమణయ్య,సర్పంచ్ షేక్ బుజ్జి, టి బాబురావు, మాజీ ఎంపీటీసీలు మునగల నారాయణ రెడ్డి,మూరం కాశిరెడ్డి ,ఇరగని చలపతి, మునగల సుధాకర్ రెడ్డి,శీలం మాధవ రెడ్డి,గోను చంద్రశేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి, కొట్టే శ్రీను,కదిరి శివ, నేమాజీ,గ్రామస్థులు ,తదితరులు పాల్గొన్నారు.

# శీలంవారిపల్లి లో కన్నుల పండువగా సీతారాముల కళ్యాణం

## భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించిన కదిరి బ్రదర్స్





**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 27**

మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా కోదండ రామస్వామి దేవస్థానం నందు శుక్రవారం సీతారాముల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు ఈ సందర్భముగా స్వామివారి ఆశీస్సులతో కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ జ్ఞాపకార్థం కుమారులు కదిరి ప్రకాష్ రావు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, కదిరి పార్థసారథి, కదిరి బాలకృష్ణ కుటుంబ సభ్యులు భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ ఆవరణం ఉదయం నుంచే పండుగ వాతావరణంతో కళకళలాడింది. శ్రీరామనవమి వేళ నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవం గ్రామం మొత్తాన్ని ఆధ్యాత్మిక కాంతులతో నింపింది. దేవాలయ ప్రాంగణం పూలతో, రంగురంగుల తోరణాలతో, విద్యుద్దీపాల వెలుగులతో శృంగారభరితంగా మెరిసింది. ఆలయ ప్రాంతం వివిధ గ్రామాల నుండి భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు అభిజిత్ లగ్నం సమయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణలతో కళ్యాణ మండపంలో శ్రీరామ-సీతల విగ్రహాలను అద్భుతంగా అలంకరించి, పుష్పాలతో, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. స్వామివారి దివ్య రూపం చూసేందుకు తరలివచ్చిన భక్తులు కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా ఆస్వాదించారు.తలంబ్రాల కార్యక్రమం ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచింది. వేద పండితులు ప్రతి మంత్రోచ్ఛరణ లో శ్రీరాముని సీతాదేవి యొక్క దివ్య గుణాలను అద్భుతంగా వర్ణిస్తూ వాటి అర్థాలను భక్తులకు వివరిస్తూ కళ్యాణోత్సవాన్ని మరింత కమనీయంగా స్వామివారి కళ్యాణాన్ని భక్తులు తిలకించి కళ్యాణం సాక్షాత్కారాన్ని లోకానికి పరిచయం చేసినట్లుగా భావోద్వేగ వాతావరణం నెలకొంది. తాళంబ్రాల చల్లి స్వామివారి దంపతులకు నిర్మలమైన ప్రతీకగా నిలిచింది. గ్రామం నుండే కాకుండాచుట్టుపక్కల ప్రాంతాల నుండి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం నిండిన భక్తజన సమూహం "జై శ్రీరామ" నినాదాలతో ఆలయ ఆవరణమంతా మార్మోగించింది. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకున్నారు. కళ్యాణ అనంతరం సీతారాముల తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ శ్రీను కోసం తోటి డ్రైవర్ల తోడ్పాటు



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 27**

జీవన ప్రయాణంలో వృత్తి రీత్యాడ్రైవర్ గా మనుగడ సాగిస్తూన్న గాజుల శ్రీనివాస్ అనే డ్రైవర్ ప్రమాదంలో గాయపడి,విగత జీవిగా మారడంతో తోటి డ్రైవర్లు ఆపన్న హస్తం అందించి ఆదుకున్నారు. పట్టణానికి చెందిన గాజుల శ్రీనుకు కొంత కాలం క్రితం ప్రయాణంలో యాక్సిడెంట్ జరిగింది దింతో వైద్యం చేయించుకుని మంచానికే పరిమితం అయ్యాడు. విషయం తెలుసుకున్న యర్రగొండపాలెం టాక్సీ డ్రైవర్స్ అండ్ ఒనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శేషు గౌడ్, సయ్యద్ ఉస్మాన్ లు సభ్యులతో కలిసి కుటుంభ అవసరాల కోసం చేయూత అందించారు. జీవన సమరంలో అనేక ఒడిదుడుగులు ఎదుర్కొంటున్న డ్రైవర్ల జీవితప్రయాణం, నిత్యం ప్రమాదాల వలయంలో చిక్కి ఉంటుందని ప్రభుత్వం డ్రైవర్లను ఆదుకునేందుకు చర్యలు తీసుకుని వారికి భద్రత కల్పించాలని అన్నారు, డ్రైవర్ గా వృత్తి సాగిస్తున్న తోటి డ్రైవర్లపై స్నేహ పూరితంగా సహకరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలా అశోక్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి,అమర్, వెంకటేశ్వర్లు, సాయి,తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నాయకులు సంబశివరాజును పరామర్శించిన బుర్రా



**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 27**

మండలంలోని పోట్లూరు గ్రామానికి చెందిన జిల్లా వైస్సార్సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులు కంపరాజు సాంబశివరాజు ఆరోగ్యం బాగులేక ఇంటివద్దనే ఉంటున్నారు. విషయం తెలుసుకున్న కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ సాంబశివరావు స్వగ్రామమైన పోట్లూరుకు వెళ్లి శుక్రవారం పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులను అడిగి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బుర్రా వెంట గుడ్లూరు వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తి సామ్రాజ్యవాదానికి ఎంతో ఆదర్శం

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు పిలుపు



**దొనకొండ మార్చి 27 పెన్ పవర్ :**

భరతమాత ముద్దుబిడ్డ సర్దార్ భగత్ సింగ్ స్ఫూర్తితో అమెరికా సామ్రాజ్యవాధానికి వ్యతిరేకంగా పోరాడుదాం అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్క్ సభ్యులు కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. సిపిఎం దొనకొండ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 95 వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కుందుర్తి చిన్న నరసింహులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్య వాదం భారతదేశాన్ని వలసగా మార్చుకొని సుమారు 200 ఏళ్ళు ప్రకృతి వనరులు ప్రజాసంపదను ఇష్టారి తన కొల్లగొట్టుకు పోయిందని అన్నారు. ఈ సుదీర్ఘ వ్యవస్థకు వ్యతిరేకంగా జాతీయ కాంగ్రెస్ చేస్తున్న పోరాటాలు నచ్చక భగత్ సింగ్ లాంటి యువ కిశోరాలు విప్లవ మార్గం ఎంచుకున్నారని తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తాండవ రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వాల నిర్లక్ష్యంతో వలస ప్రజల జీవితాలు గాల్లో కలిసిపోతున్నాయని అన్నారు. మార్కాపురం దగ్గర గురువారం జరిగిన బస్సు ప్రమాద దుర్ఘటనం విషాదకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చిరుపల్లి అంజయ్య కర్ణ హనుమయ్య కే కృష్ణ కురవాటిరామయ్య పి నతాను అంజి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నూతన రామాలయం నిర్మిద్దాం

### కొండిశెట్టి వెంకటరమణయ్య





**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 27**

ఎస్సీ కాలనీలో నూతన రామాలయ నిర్మాణమునకు బిజెపి సారథ్యంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం ఉంటుందని బిజెపి జిల్లా ప్రశిక్షణ మహాభియాన్ కోకన్వీనర్ మరియు జిల్లా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కో కన్వీనర్ కొండిశెట్టి వెంకట రమణయ్య అన్నారు మండల కేంద్రంలోని సి ఎస్ పురం ఎస్సీ కాలనీలో శుక్రవారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం భక్తులు విభిన్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. 40 సంవత్సరాల క్రితం రామాలయం నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో తిరిగి ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపేందుకు అరుగును ఏర్పాటు చేసి భక్తిపూర్వకంగా శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి చిత్రపటాలతో ప్రత్యేక పూజలు చేశారు.పూజ అనంతరం స్థానికులకు వడపప్పు - పానకం తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, వాతావరణమంతా ఆధ్యాత్మికతతో నిండిపోయింది. రామాలయ నిర్మాణం పట్ల ప్రజల్లో కనిపించిన ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా కొండిశెట్టి వెంకటరమణయ్య హాజరై ముందు దీపజ్యోతి ప్రజ్వలించి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూఎస్సీ కాలనీలో రామాలయ నిర్మాణం కోసం బీజేపీ పార్టీ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఆధ్యాత్మికంగా, సామాజికంగా ఉపయోగపడే ధార్మిక నిర్మాణాలకు ప్రాధాన్యమిస్తున్నది. త్వరలో ఈ ఆలయ నిర్మాణ అవసరమైన మద్దతు అందేలా కృషి చేస్తామన్నారు ఈ సందర్భంగా కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో మాజీ మండల టిడిపి అధ్యక్షులు గ్రంధి హేమ సుందరం, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట సత్యం, మండల బిజెపి అధ్యక్షులు పాశం రామకృష్ణ, పెనుమాల నారమ్మ, సంగిశెట్టి పేరయ్య, లక్ష్మీరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, జాజం చిన్న సుబ్బయ్య, దమ్ము మాలకొండయ్య, దమ్ము ఏమయ్యా, మాదినేని రామయ్య, రెబ్బ సౌదయ్య, దెబ్బ నారాయణ, దుర్గ ప్రసాద్, ఆ ప్రాంత ఎస్సీ కాలనీవాసులు పాల్గొన్నారు.

# చలివేంద్రాన్ని ఏర్పాటుచేసిన ఏఐటియుసి



**మార్కాపురం రూరల్ పెన్ పవర్ మార్చి 27**

ఎండాకాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు మార్కాపురం రైల్వే స్టేషన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఆటో వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రైల్వే పోలీస్ ఏఎస్ఐ మేకల వెంకటేశ్వర్లు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు అందె నాసరయ్య మాట్లాడుతూ ఎండాకాలంలో చలివేంద్రం ద్వారా ప్రజలకు, ముఖ్యంగా రైల్వే ప్రయాణికులకు ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి మేలు చేస్తాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం ఏరియా ఏఐటీయూసీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం, ఆర్టీసీ మాజీ నాయకులు కేశవ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# బస్సు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే ఇంటూరి పరామర్శ



**వలేటివారిపాలెం, పెన్ పవర్ మార్చి 27**

మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మండలంలోని అంకభూపాలపురం గ్రామానికి చెందిన బండారు పద్మ చనిపోగా0 పదేళ్ల బాలుడు బండారు రోహన్ కు స్వల్ప గాయాలతో మార్కాపురంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మార్కాపురం ఆసుపత్రికి వెళ్లి మృతురాలు పద్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారి రోహన్ తల్లిదండ్రులతో మాట్లాడారు. అక్కడే డ్యూటీ డాక్టర్లతోనూ ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడి ట్రీట్మెంట్ గురించి అరా తీశారు. ఇతర ప్రాంతాల బాధితులతో ఎమ్మెల్యే గారు మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే సొంతగా ఆర్థిక సహాయం అందజేశారు. డిఎన్ఏ పరీక్షల అనంతరం శనివారం సాయంత్రం మృతదేహాలను బంధువులకు అప్పగిస్తామని వైద్యశాల డాక్టర్లు ఎమ్మెల్యేకు తెలిపారు. బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం వీలైనంత త్వరగా బాధితులకు అందజేయడం జరుగుతుందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు.

# బస్సు ప్రమాద క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి: డాక్టర్ ఏలూరి



**మార్కాపురం పెన్ పవర్ మార్చి 27**

మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో గురువారం జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో 14 మంది దుర్మరణం చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ప్రమాదంలో మరికొంతమంది తీవ్రంగా గాయపడి మార్కాపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచనల మేరకు బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి శుక్రవారం ఆసుపత్రిని సందర్శించారు. ప్రమాదంలో గాయపడిన బాధితులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులకు అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు.. అలాగే మార్కాపురం జిల్లా డిఎంహెచ్ ఓ, జీజీహెచ్ సూపరిండెంట్, మార్కాపురం ఆర్డిఓతో ప్రత్యేకంగా మాట్లాడి చికిత్సలో అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ఈ ఘటనను అత్యంత విషాదకరమైనదిగా పేర్కొన్నారు.. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.. కాగా పరామర్శ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గోళ్ల సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


# గుడ్లూరు పీ.ఎస్‌కు బ్రీత్ అనలైజర్ బహుకరణ

**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 27**

గుడ్లూరు పోలీస్ స్టేషన్ కు బ్రీత్ అనలైజర్ పరికరాన్ని నేషనల్ హైవే పిఆర్ఓ నర్సింగరావు శుక్రవారం బహుకరించారు. ఎస్సై మాట్లాడుతూ నేషనల్ హైవే పిఆర్ఓ మరియు ఇన్చార్జి నర్సింగరావు, గుడ్లూరు పోలీస్ స్టేషన్ కి బ్రీత్ అనలైజర్ ను ఇవ్వడం జరిగినదన్నారు. ఈ సందర్భంగా నర్సింగరావుకు ఎస్సై కృతజ్ఞతలు తెలియజేశారు.



# సీతారాముల చిత్రపటాలను పంపిణీ కార్యక్రమంలో కదిరి ప్రకాష్ రావు



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 27**

మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కదిరి రత్నం కుమారుడు శివ ప్రత్యేకంగా తయారు చేయించిన శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి చిత్రపటాల మెమెంటోలను శుక్రవారం గ్రామస్తులతో కలిసి కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల చైర్మన్ కదిరి ప్రకాశరావు గ్రామంలోని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీరామనవమి పండుగ సందర్భంగా కదిరి శివ స్వామి వారి చిత్రపటాల మెమెంటోలను 160 మంది కుటుంబ సభ్యులకు గ్రామంలోని ప్రతి కుటుంబానికి అందజేయడం అభినందనీయమని అన్నారు ఈ కార్యక్రమంలో దాత కదిరి శివ, కొట్టే వెంకట కొండయ్య, కంటే వేణు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి

* రామాలయంలో ప్రత్యేక పూజలు జరిపిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర.





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. మార్చి 27 :** ప్రజలంతా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలు కలిగి ఉండాలని, ప్రజలకు సేవ చేసేందుకు నాకు మరింత శక్తిసామర్థ్యాలు ఇవ్వాలని ఆ శ్రీరాములువారిని వేడుకున్నానని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పార్వతీపురం పట్టణం పాతబస్టాండ్లో ఎంతో చరిత్ర కలిగిన శ్రీరాములవారి ఆలయాన్ని ఆయన సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీరాములువారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.
అనంతరం ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర. పార్వతీపురం నియోజకవర్గ ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు నాకు శక్తిసామర్థ్యాలు ఇవ్వాలని, నియోజకవర్గ ప్రజలంతా సస్యశ్యామలంగా ఉండాలని, అందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కల్పించాలని ఆ భగవంతున్ని వేడుకున్నానన్నారు. మరోసారి ప్రజలందరికీ పేరుపేరునా శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలుపుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ఘనంగా చుక్క వలస పాఠశాల వార్షికోత్సవం ...



**చీపురుపల్లి నియోజకవర్గం పెన్ పవర్ మార్చి 27.** చీపురుపల్లి నియోజకవర్గం పరిధిలోని చుక్క వలస ఎంపీయూపీ ప్రభుత్వ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు స్కూల్ చైర్మన్ శనపతి జగన్నాథం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదటిగా జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమమును ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా గరివిడి మండల విద్యాశాఖ అధికారి పాల్గొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థిని విద్యార్థులు చేపట్టిన సాంస్కృతి కార్యక్రమాలు ఎంతో అలరించాయి. అంతేకాకుండా ఈ పాఠశాల నుండి బదిలీపై వెళ్లిన రాజు మాస్టారు, రాజశేఖర్ మాస్టారు, రాము నాయుడు మాస్టారులను ఘనంగా సన్మానించారు. అలానే తెలుగుదేశం నాయకులు శనపతి సత్యన్నారాయణను కూడా పాఠశాలకు ఆయన అందిస్తున్న సహాయ సహకారాలకు మెచ్చి ఆయన కూడా అభినందిస్తూ సన్మానించారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు రమేష్ చంద్ర మాస్టార్ ని కూడా ఆయన చేస్తున్న సేవలకు గాను సన్మానించడం జరిగినది. అలానే మిగతా ఉపాధ్యాయులను కూడా సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో చుక్క వలస పాఠశాల ఉపాధ్యాయులు రమేష్ , నాగమణి, జగదీష్ ,శ్రావ్య , స్వప్న , శోధన సిబ్బంది గ్రామ ఉపసర్పంచ్ కే వెంకటరమణ ,సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## అమ్మవారిని దర్శించుకున్న జిల్లా ఫోక్స్ కోర్టు జడ్జ్..



**చీపురుపల్లి పెన్ పవర్ మార్చి 27 .** చీపురుపల్లి పట్టణమును వెలసిన శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని జిల్లా ఫోక్స్ కోర్టు జడ్జి కే నాగమణి శుక్రవారం నాడు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, ఆలయ ఉద్యోగులు, ఆలయ పండితులు, ప్రోటోకాల్ ప్రకారం ఆమెకు ఘన స్వాగతం పలికారు, గౌరవప్రదంగా దుస్సాలను కప్పి సన్మానించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాలను అందజేసి చిత్రపటాన్ని కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కోర్టు సిబ్బంది ఆలయ సిబ్బంది తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# బాధితులకు అండగా మేము సైతం..

**చీపరుపల్లి పెన్ పవర్ మార్చ్ 27 .** చీపురుపల్లి పట్టణంలోని ఆంజనేయ పురంలో నివాసముంటున్న దువ్వూరి సాయికృష్ణ గత మూడు సంవత్సరాలుగా మంచానికే పరిమితమై అనారోగ్యంతో అష్ట కష్టాలు పడుతున్న నేపథ్యంలో పట్టణానికి చెందిన మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు శుక్రవారం నాడు ఆ కుటుంబానికి పదివేల రూపాయలు విరాళాన్ని వితరణగా అందజేశారు. గత మూడు సంవత్సరాలుగా ప్యారా పీర్జ్యం వ్యాధితో బాధపడుతున్న సాయి కృష్ణ కుటుంబానికి అండగా నిలబడాలి అనే నేపథలో కు మేము సైతం సభ్యులు అండగా నిలిచారు. మందులకు కనీసం డబ్బులు కూడా లేకుండా ఇబ్బంది పడుతున్న కుటుంబాన్ని ఆదుకోవాలని నేపథ్యంలోని మేము సైతం సభ్యులు స్పందించి కుటుంబానికి అండగా నిలిచారు. స్వచ్ఛనంగా ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి కష్టాల ఉన్న కుటుంబాన్ని ఆదుకోవాలని ఈ సందర్భంగా సంఘ సభ్యులకు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సభ్యులు స్వీజి శ్రీనివాసరావు, అద్దూరి సీతబాబు, వలిరెడ్డి రవీంద్రనాయుడు, సూరు కుమార్, కిల్లంశెట్టి సన్యాసిరావు, బలగ రామారావు, పొట్నూరు నర్సింగరావు, సూరు వెంకటేశ్, ఉరిటి రమణ, కేవీ సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.




# సీతమ్మవారికి పుట్టింటి సారె ...





**చీపురుపల్లి పెన్ పవర్ మార్చ్ 27 .** చీపరుపల్లి పట్టణంలోని పాత కుమ్మర వీధికి సంబంధించిన ప్రజలంతా శుక్రవారం నాడు శ్రీరామనవమి సందర్భంగా దేశం లో అన్ని రామ మందిరాల్లో రాముల వారి కళ్యాణం వైభవోపేతంగా జరుపుకుంటున్న నేపథ్యంలో సీతమ్మవారికి పుట్టింటి సారి ను సమర్పించారు,అందులో భాగంగా శ్రీరామనవమి శుభ సందర్భంగా చీపురుపల్లి మండలంలో ఉన్న కస్పావీధి రామ మందిరం ప్రాంగణంలో
శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నులు పండుగగా ఘనంగా నిర్వహించడం జరిగింది.
పాత కుమ్మరి వీధి వాసులు అందరూ కలిసి ప్రతి ఇంటి నుండి పిండి వంటలు, పళ్ళు కాయలు, పట్టువస్త్రంలు, తాళిబొట్టు, పసుపు కుంకుమ, గాజులు, మెట్టెలు, తలంబ్రాలు, సారి సామానులతో కాలనీ పెద్దలు, యువత మహిళాలు, పిల్లలు ఊరేగింపుగా మేళ తాళాలతో సీతమ్మవారికి పుట్టింటి తరుపున సారెను కస్పావీధిలో కొలువైన కోదండరామస్వామి ఆలయములో ప్రధాన అర్చకులకు సమర్పించారు.కాలనీవాసుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిధులు గా పాల్గొన్న వైస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, చీపురుపల్లి జడ్పిటిసి సభ్యులు వలిరెడ్డి శిరీష, సతీసమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీతమ్మ సారేను కాలనీ మహిళలు తలపై మోసుకుని మేళతాళాలతో ఊరేగింపు గా పాత కుమ్మరి వీధి, సెగిడివీధి, దేవాంగుల వీధి, కస్పావీధి మీదుగా రామ మందిరానికి చేరుకొని రాముల వారి కళ్యాణంలో సారే సమర్పించారు.అంగరంగ వైభవంగా నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణం మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని
శ్రీ సీతారాముల కల్యాణం ను వీక్షించారు.ఈ సందర్బంగా ప్రజలందరికి శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపిన,జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జడ్పీటీసీ శిరీష దంపతులు లోక కళ్యాణం కోసం ఎన్నో త్యాగాలకోర్చిన సీతారాముల పవిత్ర బంధం అజరామరమైనది, తర తరాలకు ఆదర్శనీయమైనది. సీతారాముల ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవనం సాగించేలా దీవించాలని ఆ దివ్యమూర్తులను ప్రార్థిస్తూ
ప్రజలందరికీ "శ్రీరామ నవమి శుభాకాంక్షలు" తెలిపారు.ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న వారిలో విజయనగరం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జడ్పిటిసి సభ్యులు వలి రెడ్డి శిరీష, ప్రభాత్ కుమార్ , మీసాల శ్రీనివాసరావు, చంద్రశేఖర్ గుప్తా,చందక శ్రీను, ఊలపల్లి బసవన్న, సోపేటి జగదీశ్వరరావు, సోపేటి కనకరాజు, దయంత్రి సురేష్,దయంత్రి సతీష్, సబ్బి నాగు, చందక భవాని, నారాయణశెట్టి సోమేశ్, అశోక్, కాలనీ పెద్దలు, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు..

## ఎన్నికల సంఘమే కీలకం.. ఎన్నికల సంఘం పారదర్శకంగా నియమించబడాలి



– జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వి.బ్రహ్మ రెడ్డి

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 27 :** ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించగలిగే శక్తి ఒక్క ఎన్నికల సంఘానికి ఉంటుందని, అటువంటి ఎన్నికల సంఘాన్ని పారదర్శకంగా నియమించాల్సిన బాధ్యత ఈ పాలకులపై ఉందని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి అభిప్రాయపడ్డారు. జనవిజ్ఞాన వేదిక, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కంటోన్మెంట్ గురజాడ పాఠశాలలో ఎన్నికల కమిషన్ పనితీరు అన్న అంశంపై చర్చ వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజల హక్కులను పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలకు తొత్తులుగా మారడం ప్రజాస్వామ్యానికి విఘాతమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ పార్టీకి అనుకూలంగా, ప్రతికూలంగా కాకుండా ప్రజాస్వామ్య ఐక్యవేదిక ప్రజల హక్కులను కాపాడటమే ధ్యేయంగా పనిచేస్తుందని తెలిపారు. ఎన్నికల సంఘాన్ని నియమించాల్సిన బాధ్యత ప్రధాన మంత్రి, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కి ఉన్నప్పటికీ,ఎన్నికల నియామకం ప్రజాస్వామ్యబద్ధంగా కాకుండా అధికార పార్టీకి అనుకూలంగా ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. గడిచిన ఎన్నికల నుండి చూస్తే ఎన్నికల సంఘం ప్రజల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఎన్నికల సంఘం తీరువల్ల ప్రజలు ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే హక్కును కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టిఎన్ శేషన్ ఎన్నికల ప్రధాన అధికారిగా ఎన్నో సంచలనాత్మకమైన నిర్ణయాలతో ఎన్నికల సంఘం హక్కులను,బాధ్యతలను ప్రజలకు తెలియజేశారని, అటువంటి సంఘాన్ని నిర్వీర్యం చేసే దిశగా నేటి ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికల అధికారులను ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నియమించాల్సి ఉన్నప్పటికీ నేటి పాలకులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తప్పించి ఆ స్థానంలో క్యాబినెట్ మంత్రికి ఎన్నికల సంఘాన్ని నియమించే బాధ్యతలకు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమన్నారు.
ప్రజాస్వామ్య ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కౌతారపు ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల సంఘం పనితీరును ప్రశ్నించడమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ, ప్రజలకు ఎన్నుకునే హక్కు లేకుండా చేస్తుందని అభిప్రాయపడ్డారు. జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకుల గండ్రేటి లక్ష్మణరావు, గండ్రేటి అప్పలనాయుడు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి డాక్టర్ పైల రమేష్ రాజు,జాతీయ విద్యా విభాగం కన్వీనర్ డాక్టర్ ఏవి రాజశేఖర్,జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎరుకొండ ఆనంద్, డాక్టర్ మిరియాల కృష్ణారావు, పి.షణ్ముఖరావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జి.శ్రీరాములు,జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## జగమంతా రామమయం..

శ్రీరామనవమి వేడుకలు పాల్గొన్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం






**హుకుంపేట పెన్ పవర్ మార్చ్ 27:** అల్లూరు సీతారాముల జిల్లా అరకు నియోజకవర్గం, హుకుంపేట మండల కేంద్ర పరిధిలో గల కొంతిలి గ్రామపంచాయతీమరియు గ్రామంలో జరిగిన శ్రీరామనవమి పర్వదిన వేడుకల్లో భాగంగా శ్రీశ్రీశ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పాల్గొన్నారు
ఈ సందర్భంగాఅయన మాట్లాడుతూ శ్రీరాముడి దివ్య ఆశీస్సులు మనందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ఆ సీతారాముల కృపతో అందరి జీవితాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు,మరియు సిరిసంపదలు కలగాలని ఆకాంక్షిస్తూ ప్రజలకుఅయన శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం అల్లూరి సీతారామరాజు జిల్లా పి.ఆర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తమర్బా కొండయ్య పడల్,మాజీ ఎంపీపీ తామర్బ సత్యమాధవి పడాల్,కొంతిలి సర్పంచ్ రేగం రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఉత్సవ కమిటీ రైజింగ్ స్టార్ మహిళలు పాల్గొని అంగరంగ వైభవంగా నిర్వహించారు.
అనంతరం అన్నదాన కార్యక్రమంలో భారీ ఎత్తున భక్తులు పాల్గొనారు.
పలువురు మహిళలకు దుస్సాలువతో సన్మానం చేశారుఈ కార్యక్రమంలో హుకుంపేట మండలం సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసి నాయుడు మరియు ,హుకుంపేట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాంగి అనిల్ ,హుకుంపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ సమ్మిడ వెంకట పూర్ణిమ ,అల్లూరి జిల్లా వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బత్తిరి రవిప్రసాద్ ,రేగం శివరాం హుకుంపేట వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షులు కాకారి వెంకట్రావు మరియు భక్తులు గ్రామస్తులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అశోక్ పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

భారత్ ఆదివాసీ పార్టీ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి 27:**ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందలం అశోక్ పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మొట్టడం రాజబాబు డిమాండ్ చేసారు.బెంతి ఒరియా కులాన్ని గిరిజన జాబితాలో కలుపొద్దని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందలం ఆశోక్ ను కలిసి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన ఆదివాసీ నాయకులు హుందాగా, మర్యాద గా మాట్లాడుతున్నా సమయంలో ఒక ఆదివాసీ యువకుడిపై వ్రాయలేని భాషను ఉపయోగిస్తూ,ఆఫ్ నాలెడ్జ్ పీపుల్, బాస్టర్డ్ అంటూ ఎమ్మెల్యే అశోక్ తిట్టడం బాధాకరం.అదే భాషను లేదా అంతేకంటే ఎక్కువ కూడా ఆదివాసీలు ఉపయోగించగలరు,కానీ ఆదివాసీలు సభ్యతతో మెలిగారు.అదే భాషను ఆదివాసీలు ఉపయోగించి ఉంటే ఆ ఎమ్మెల్యే మొఖం ఎక్కడ పెట్టుకొనేవాడని,ఆదివాసీలపై దళితులపై సామాన్యంగా కన్నెర్రజేసిన,కోపంతో చూసిన,తిట్టిన, కొట్టిన,పరుష పదజాలం ఉపయోగించిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టవచ్చు.ఈ ఎమ్మెల్యేపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ సుమోటాగా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుపెట్టి కఠినంగా శిక్షించాలని,
క్రమశిక్షణకు మారుపేరు అని చెప్పుకొనే చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే అశోక్ ను తెలుగుదేశంపార్టీ నుండి సస్పెండ్ చేయాలని,పార్టీలకు అతీతంగా ఆదివాసీ రాజకీయ నాయకులు,ఆదివాసీ సంఘాలు స్పందించాలని ఆయన కోరారు.

# స్టీల్ ప్లాంట్ క్రెడిట్ వార్

**విశాఖపట్టణం మార్చి 27, పెన్ పవర్:** అనకాపల్లి జిల్లా నక్కపల్లి రాజయ్యపేట లో ఏర్పాటు కానున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ చుట్టూ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద క్రెడిట్ వార్ నడుస్తోంది. మార్చి 23, 2026న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మెగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా, దీనిపై మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, దానికి టీడీపీ ఇచ్చిన కౌంటర్లు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయితాడేపల్లిలో అద్దంకి పార్టీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో జగన్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుకు పునాది పడింది తన హయాంలోనే అని స్పష్టం చేశారు. 2022లో దావోస్ పర్యటనలో తాను ఆదిత్య మిట్టల్‌తో చర్చలు జరిపానని, నక్కపల్లితో పాటు పలు ప్రాంతాలను వారికి చూపించామని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందే ఈ ప్లాంట్ ఖరారైందని, ఇప్పుడు చంద్రబాబు దీనిని తన ఖాతాలో వేసుకోవాలని చూడటం క్రెడిట్ చోరీ అని విమర్శించారు. జగన్ వ్యాఖ్యలపై టీడీపీ నేతలు ఘాటుగా స్పందిస్తున్నారు. గతంలో జగన్ ఒక ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ.. ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ ఒడిశాలో వస్తోంది.. బాబు మాత్రం ఏపీకి వస్తుందంటూ జనం చెవిలో పూలు పెడుతున్నారు అని అన్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఒడిశాకు వెళ్తుందన్న ప్లాంట్ ఇప్పుడు ఏపీకి ఎలా వచ్చింది? మీ హయాంలో ఒప్పందం జరిగితే అప్పుడే ఎందుకు శంకుస్థాపన చేయలేదు? అంటూ సోషల్ మీడియా వేదికగా నిలదీస్తున్నారు.సుమారు 1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రానున్న ఈ ప్లాంట్, విశాఖ స్టీల్ ప్లాంట్ కంటే పెద్దదని ప్రభుత్వం చెబుతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా,

పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. 2028 డిసెంబర్ నాటికి ఉత్పత్తి ప్రారంభం కావచ్చని అధికారులు వెల్లడించారు.ఒకవైపు వైఎస్సార్‌సీపీ మేము తెచ్చిన ప్రాజెక్టును బాబు వాడుకుంటున్నారు అని ప్రచారం చేస్తుంటే, మరోవైపు టీడీపీ జగన్ హయాంలో పరిశ్రమలు పారిపోయాయి.. కూటమి ప్రభుత్వం వల్లే పెట్టుబడులు వస్తున్నాయి అని కౌంటర్ ఇస్తోంది. ఈ క్రెడిట్ వార్ ప్రస్తుతం ఏపీ పాలిటిక్స్‌లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఫ్యాన్ కింద ఉక్కపోతేనా



**కడప, మార్చి 27, పెన్ పవర్:** నియోజకవర్గాల పునర్విభజనతో వైసీపీ వైపు చూసే నేతల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయన్నఅం చనాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతమున్న 175 నియోజకవర్గాల నుంచి 263కు, ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరగనున్నాయి. అంటే ప్రస్తుతమున్న నేతలకు తోడు అదనంగా మరో వంద మందికి పైగా నేతలకు వచ్చే ఎన్నికలలో టిక్కెట్లు దక్కనున్నాయి. అదే వైసీపీలో ఉంటే అడ్వాంటేజీ ఉంటుందన్న భావన నేతల్లో కలుగుతుంది. కూటమి కంటే ఫ్యాన్ పార్టీలో ఉంటేనే బెటర్ అని ఎక్కువ మంది సీట్లు ఆశిస్తున్న నేతలు భావిస్తున్నారు.కూటమిలో ఉండి టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తే సీటు వస్తుందో లేదో చివరకు వరకూ టెన్షన్ తప్పదు. ఎందుకంటే కూటమిలో టీడీపీ, బీజేపీ, జనసేన మూడు పార్టీలుండటంతో ఎవరికి ఏ స్థానం కేటాయిస్తారన్నది ఎవరికీ అంతుచిక్కదు. చివరి నిమిషంలో కూటమిలో ఏ పార్టీ అయినా పట్టుబడితే తాము ఆశించిన సీటు చేజారి పోయే అవకాశముంది. మొన్నటి ఎన్నికల్లోనూ అనేక మంది సీనియర్ నేతలకు, ఆశావహులకు టిక్కెట్లు దక్కకపోవడానికి కూటమిలో పొత్తుల వల్లనేనని చాలామంది రాజకీయ నేతలు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలో కష్టపడ్డ తమకు గుర్తింపు రావాలంటే వైసీపీ అయితే బెటర్ అని భావించే అవకాశముంది.అదే వైసీపీలో చేరితే తాము గట్టిగా ప్రయత్నిస్తే టిక్కెట్ దక్కడం సులువవుతుందని ఎక్కువ మంది నేతలు నమ్ముతున్నారు. 263 శాసనసభ, 38 పార్లమెంటు నియోజకవర్గాల్లో పాత నేతలు కొందరు వెళ్లినా కొత్త వారికి అవకాశాలు వైసీపీలోనే దక్కుతాయని అప్ కమింగ్ లీడర్లు భావిస్తున్నారు. వైసీపీ సింగిల్ గా పోటీ చేస్తున్నందున పోటీ తక్కువగా ఉంటుందన్న ఆలోచనలో ఉన్నారు. అందుకే ఇప్పుడు రానున్న కాలంలో ఎక్కువ మంది నేతలు వైసీపీ వైపు వచ్చే అవకాశముందన్న అంచనాలు కూడా వినపడుతున్నాయి. టిక్కెట్ దక్కాలంటే ఫ్యాన్ కంటే పదిలం మరేది ఉండదన్న భావన ఎక్కువ మందిలో కలుగుతుంది. మరి రానున్న కాలంలో వైసీపీలో చేరికలు ఏ మాత్రం ఉంటాయన్నది చూడాలి.

## అడగడుగునా లోపాలే...

**ఒంగోలు, మార్చి 27, పెన్ పవర్:** మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర ప్రమాదానికి బస్సు కండిషన్ కూడా ఒక కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.దారి మధ్యలో ప్రమాదానికి గురైన బస్సు రిపేరుకు గురయిన విషయాన్నిబాధితులు చెబుతున్నారు. యర్రగొండపాలెం సమీపంలో బస్సు రిపేర్ కావడంతో దానిని అరగంట సేపు మరమ్మతులు చేసి తిరిగి బయలుదేరాశారని ప్రయాణికులు చెబుతున్నారు. ఈరోజు తెల్లవారు జామున 4.20 గంటలకు టోల్ గేట్ బస్సు దాటింది. టోల్ గేట్ దాటిన యాభై నిమిషాలకు ప్రమాదం జరిగిందని, 5.20 గంటలకు బస్సు ప్రమాదానికి గురయిందని బాధితులు తెలిపారు.మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర ప్రమాదం బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఇప్పటి వరకు 13 మంది మృతదేహాలను వెలికితీశారు. ప్రమాదం నేపథ్యంలో కీలక విషయం వెల్లడైంది. బస్సు కండీషన్‌పై అందులోని ప్రయాణికులు ముందుగానే ఆందోళన వ్యక్తం చేశారు. కండీషన్ సరిగా లేదని డ్రైవర్‌తో చెప్పారు. దీంతో బస్సు సిబ్బంది యర్రగొండపాలెం వద్ద గంటసేపు నిలిపి మరమ్మతులు చేశారు. అనంతరం బయల్దేరిన కొంత సమయం తర్వాత మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద ఈ ఘోరం జరిగిపోయింది. బస్సు డ్రైవర్‌ను అధికారులు విచారిస్తే స్టీరింగ్ స్ట్రక్ అయిందని చెప్పినట్లు తెలిసింది.స్టీరింగ్ కూడా స్ట్రక్ అయిందని చెబుతున్నారు. అలాగే బస్సు కండిషన్ కూడా బాగా లేదని తాము గమనించినట్లు ప్రయాణికులు అంటున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షణాల్లో మంటలు అంటుకోవడంతో ఎవరూ తప్పించుకోలేకపోయారని, ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం నలభై ఒక్క మంది ప్రయాణికులున్నారని చెబుతున్నారు. అందులో పదమూడు మంది చనిపోగా, 26 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారు. మృతదేహాలు గుర్తు పట్టలేని విధంగా ఉండటంతో నెల్లూరు నుంచి ఫోరెన్సిక్ నిపుణులను రప్పిస్తున్నారు. ఆరోగ్యం విషమంగా ఉన్న వారిని ఒంగోలు ఆసుపత్రికి తరలించారు.

## మాటలు సరే... చేతలు ఎక్కడా

**కడప, మార్చి 27, పెన్ పవర్:** జగన్ మోహన్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో 2024 ఎన్నికల ఓటమి ఒక పెద్ద కుదుపు. అయితే, ఓటమి తర్వాత ఆయన కేడర్‌లో ధైర్యం నింపడానికి, ప్రజల్లోకి వస్తానని పదేపదే చేస్తున్న ప్రకటనలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రేపు మాపు అంటూ కాలం గడుపుతున్న తీరుపై సొంత పార్టీలోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.2024 జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు వైఎస్ జగన్ చేసిన ప్రకటనలను గమనిస్తే, ఆయన యాక్షన్ ప్లాన్ కేవలం ప్రకటనలకే పరిమితమైందని స్పష్టమవుతోంది. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారి పార్టీ నేతలతో మాట్లాడిన జగన్, "ప్రజల పక్షాన పోరాడతాం, త్వరలోనే జిల్లాల పర్యటనలు చేపడతాను" అని ప్రకటించారు. కానీ ఆ తర్వాత ఆయన పర్యటనలు కేవలం బెంగళూరు ప్యాలెస్‌కు, తాడేపల్లి క్యాంప్ ఆఫీసుకే పరిమితమయ్యాయి. అక్టోబర్ 2024 నుంచి జిల్లాల బాట పడతానని కేడర్ ను కలుస్తానని చెప్పారు. కానీ ఆ దసరా కూడా దాటిపోయింది.దసరా అనంతరం మీడియా ముందుకొచ్చిన జగన్, సంక్రాంతి తర్వాత జిల్లాల పర్యటనలు చేస్తానన్నారు. నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతానన్నారు. వారంలో రెండ్రోజులు పాటు జిల్లాల్లోనే ఉంటానన్నారు. అది కూడా దాటిపోయింది. 2025 ఉగాది తర్వాత క్షేత్రస్థాయి పర్యటనలు ఉంటాయని, బస్సు యాత్ర చేసే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. కానీ అది కూడా దాటిపోయింది. ఇప్పటికే ఏడాది అయింది. కానీ ఆయన జనంలోకి మాత్రం రాలేదు.ఇప్పుడేమో వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర ప్రారంభిస్తానని జగన్ చెప్తున్నారు. అంతేకాదు.. పాదయాత్రలో చంద్రబాబుకు సినిమా చూపిస్తానంటున్నారు. ఇలాంటి ప్రకటనలు కేడర్ లో తాత్కాలిక ఉత్సాహం నింపుతున్నాయి కానీ, ఇలాంటి వాటి వల్ల పార్టీకి కలిగే ప్రయోజనం ఏమీ ఉండదు. గతంలో ఆయన ఇచ్చిన స్టేట్ మెంట్లలో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. దీంతో ఇప్పుడు పాదయాత్ర కూడా స్టేట్ మెంట్ కు పరిమితమైపోయే అవకాశం ఉందనే ఊహాగానాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి.ఇదిగో వచ్చేస్తున్నా, అదిగో వచ్చేస్తున్నా అని చెప్పిన మరుసటి రోజే జగన్ బెంగళూరు వెళ్లిపోతున్నారు. దీంతో కేడర్ కి ఇలాంటి స్టేంట్ మెంట్స్ వినడం అలవాటైపోయింది. వాళు కూడా పెద్దగా పట్టించుకోవడం మానేస్తున్నారు. ఈ సారైనా చెప్పిన మాట మీద నిలబడితే బాగుంటుందని కేడర్ కోరుకుంటోంది. జగనన్న మాట తప్పడు, మడమ తిప్పడు అని కేడర్ చెప్పుకుంటూ ఉంటుంది. కానీ ఇప్పుడు ఆయన చేతలు స్టేట్ మెంట్స్ కే పరిమితం అవుతుండడంతో కేడర్ లోనే అనుమానాలు మొదలవుతున్నాయి.

# రాజధానిగా రాజముద్ర..

**అమరావతి, మార్చి 27, పెన్ పవర్:** వేల కోట్లతో నవ్యాంధ్ర రాజధాని నిర్మాణం. మిషన్ మోడ్‌లో పనులు. పెద్ద పెద్ద టవర్లు. ఇంటర్నేషనల్ లెవల్ స్టాండర్డ్స్‌తో నిర్మాణాలు. ఇలా ఏడాదిన్నరగా అమరావతి అన్‌స్టాపబుల్ అన్నట్లుగా దూసుకెళ్తోంది. గతానికి మించి కొత్త కలతో కళకళలాడటమే కాదు..సరికొత్తగా రూపుదిద్దుకుంటోంది. కానీ ఒక్కటే బాకీ ఉంది. అదే రాజధాని రాజముద్ర. రాజముద్ర పడితే ఇక నో ప్రాబ్లమ్. ఇటు రైతులు..అటు సీఎం చంద్రబాబు అందరి మదిలో ఉన్నమాట ఇది. ఇందుకోసం కూటమి సర్కార్ చేసిన ప్రయత్నాలన్నీ ఫైనల్ స్టేజ్‌కు చేరి..అమరావతికి హోదా దక్కేందుకు రూట్ క్లియర్ అవుతోంది.కూటమి సర్కార్ ప్రెజర్..కేంద్ర ప్రభుత్వ చర్యలు అన్నట్లుగా డెవలప్‌మెంట్ నడిచింది. కానీ సడెన్‌గా ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం అంటూ నోటిఫికేషన్ రిలీజ్ అయింది. ఈ నెల 28న ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశమై..ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని గుర్తించాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేయనుంది. ఆ తీర్మానానికి గవర్నర్ ఆమోదం తెలిపిన వెంటనే నోటిఫికేషన్ జారీ కానుంది. దాన్ని కేంద్రానికి పంపించనుంది ఏపీ సర్కార్. ప్రస్తుత పార్లమెంట్ సెషన్‌లోనే విభజన చట్ట సవరణ బిల్లు పెట్టి..అమరావతిని ఏపీ రాజధానిగా బిల్ పాస్ చేయనున్నారు.అయితే రాజధానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపితే చాలు అంటున్నారు. కానీ ఫ్యూచర్‌లో సమస్యలు రాకుండా ఉండాలంటే అసెంబ్లీలో తీర్మానం చేయడమే బెటర్ అని భావిస్తున్నారట. పీఎంవో నుంచి అందిన సూచనల ప్రకారమే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టి తీర్మానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారట. అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ రాష్ట్ర విభజన చట్టంలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం ఇప్పటికే సానుకూలంగా స్పందించింది. కేంద్రం డౌట్స్ అన్నింటిని క్లారిఫై చేసిన ఏపీ ప్రభుత్వం పూర్తి సమాచారాన్ని అందజేసింది. ఈ క్రమంలోనే ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే



రాష్ట్ర విభజన చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం..ఏపీ అసెంబ్లీ నుంచి ప్రత్యేక తీర్మానం కోరినట్లు తెలుస్తోంది.రాష్ట్ర విభజన చట్టం ప్రకారం విభజిత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే కొత్త రాజధానిని ఎంచుకోవాలి. 2014 జూన్ 2ను అపాయింటెడ్ డేగా నిర్ణయిస్తూ, రెండు రాష్ట్రాలకు పదేళ్ల పాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే నిర్దేశిత పదేళ్ల కాలం పూర్తయింది. ఈలోపే ఏపీ ప్రభుత్వం కొత్త రాజధాని ఏర్పాటు చేసుకుంది. అయితే దానికి చట్టబద్ధత లేదని అపోహలున్నాయి. 2015 ఏప్రిల్ 23నే అప్పటి ప్రభుత్వం రాజధాని అమరావతి అంటూ జీవో 97ను జారీ చేసింది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరిట హైడ్రామా నడిచింది. 2024 ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చాక..మళ్లీ రాజధాని పనులు స్పీడ్ అయ్యాయి.ఈ క్రమంలోనే రాజధాని రైతుల నుంచి ప్రధాన డిమాండ్ ఒకటి వినిపిస్తూ వస్తోంది. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే..ఫ్యూచర్‌కు ఢోకా ఉండదని వాళ్లు సీఎం చంద్రబాబును రిక్వెస్ట్ చేశారు. భవిష్యత్‌లో ఎవరు అధికారంలో ఉన్నా..రాజధానిని మార్చడానికి వీల్లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అయితే అమరావతిని రాజధానిగా గుర్తించే చట్టసవరణ బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఆమోదింపజేయాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది.మొన్నటి కేంద్ర క్యాబినెట్ సమావేశంలోనే ఏపీ రాజధాని బిల్లును ఆమోదిస్తారని ప్రచారం జరిగింది. కానీ అసెంబ్లీ తీర్మానం లేకుండా బిల్లును ఆమోదించలేమని కేంద్ర న్యాయశాఖ చెప్పడంతో..లాస్ట్ మినిట్‌లో పక్కన పెట్టినట్లుగా టాక్ నడుస్తోంది. 28న అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి పంపిన తర్వాత..ఏప్రిల్ 1న కేంద్ర క్యాబినెట్ భేటీలో బిల్లును ఆమోదించి అదే రోజు పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. ఆ తర్వాత రాష్ట్రపతి రాజముద్రతో గెజిట్ రిలీజ్ చేస్తారని అంటున్నారు.

# కొత్త నేతల కోసం పార్టీల ఎదురుచూపులు

**విజయవాడ, మార్చి 27, పెన్ పవర్:** ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకవైపు వైసీపీలో నాయకత్వాన్ని ప్రశంసించే వారు కొందరైతే, క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేసే వారు మరో వర్గంగా కనిపిస్తున్నారు. అదే పరిస్థితి టీడీపీ లో కూడా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురించి, మంత్రి నారా లోకేష్ గురించి ఎక్కువగా పొగిడే నాయకులు ఒకవైపు ఉంటే, నిశ్శబ్దంగా పని చేసే వారు మరోవైపు ఉన్నారుఇటీవల చంద్రబాబు నాయుడు కూడా ఈ విషయంపై స్పందిస్తూ, మాటలకంటే పని చేసే వారినే పార్టీ గుర్తిస్తుందని స్పష్టం చేశారు. మీడియా ముందు విమర్శలు చేయడం, ప్రత్యర్థి పార్టీలపై దాడి చేయడం ద్వారా మైలేజ్ పొందే ప్రయత్నాలను ఆయన తప్పుపట్టారు. ఇదే సమయంలో వైసీపీ)లో ఇలాంటి మందలింపులు బయటకు రావడం లేదు అనే అభిప్రాయం వినిపిస్తోంది. ఇక దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన అంశం కూడా ఇప్పుడు కీలకంగా మారింది. దాదాపు 50 శాతం వరకు నియోజకవర్గాలు పెరిగే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా సుమారు 88 అసెంబ్లీ స్థానాలు, 12 పార్లమెంట్ స్థానాలు పెరిగే అవకాశముందని వార్తలు వస్తున్నాయి. ఈ మార్పుల నేపథ్యంలో పార్టీలకు కొత్త నాయకుల అవసరం తప్పనిసరిగా మారింది.అయితే ఇక్కడే అసలు సమస్య కనిపిస్తోంది. బాగా చదువుకున్న నాయకులను ఎంపిక చేయాలని అనుకుంటే, అలాంటి వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. మరోవైపు సాధారణ స్థాయి నాయకులు ఉన్నా, వారిలో సామర్థ్యం ఎంత అనే ప్రశ్న ముందుకు వస్తోంది. కేవలం పొగడ్తలు చెప్పే వారిని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో జెండా మోస్తూ పని చేసే కార్యకర్తలకు అవకాశాలు ఇవ్వాలనే ఆలోచన కూడా ఉంది. కానీ అక్కడ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇచ్చే సిఫారసులు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ కారణంగా సరైన వ్యక్తిని ఎంపిక చేయడం పార్టీలకు సవాల్‌గా మారింది. ప్రతి నియోజకవర్గంలో పరిస్థితులు ఒకేలా లేకపోవడం కూడా సమస్యను పెంచుతోంది.కొన్ని జిల్లాల్లో నాయకుల సంఖ్య ఎక్కువగా ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో సరైన నాయకత్వం కొరతగా ఉంది. ఈ అసమతుల్యత కారణంగా పార్టీలకు నిర్ణయాలు

తీసుకోవడం కష్టం అవుతోంది. భవిష్యత్తులో బలమైన నాయకత్వం అవసరం పెరుగుతుందని స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే, రాజకీయ పార్టీలకు ప్రస్తుతం నాయకుల ఎంపిక ఒక కీలక పరీక్షగా మారింది. సరైన వ్యక్తులను గుర్తించి అవకాశాలు ఇవ్వడం ద్వారా మాత్రమే భవిష్యత్తులో విజయాన్ని సాధించగలవు. ఇంకా రెండు సంవత్సరాల సమయం ఉన్న నేపథ్యంలో, నాయకులు తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశం ఉంది. అదే సమయంలో పార్టీలు కూడా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ఇతర రాష్ట్రాలకు జనసేన

**విజయవాడ, మార్చి 27, పెన్ పవర్:** పవన్ కళ్యాణ్ తన పార్టీని కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం చేయకుండా, ఇతర రాష్ట్రాల్లోనూ విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో మాజీ ఎమ్మెల్యే పి.ఎస్. ప్రకాష్ వంటి నేతలు పార్టీలో చేరడం జనసేన జాతీయ విస్తరణ ప్రయత్నాలకు ప్రారంభం అనుకోవచ్చు. జనసేన పార్టీ ప్రస్థానంలో 2024 ఎన్నికలు ఒక మైలురాయిగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌లో 100% స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించిన తర్వాత, పవన్ కళ్యాణ్ ఇప్పుడు తన రాజకీయ దృష్టిని పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ . తమిళనాడు వైపు మళ్లిస్తున్నారు. బెంగళూరులోని చిక్‌పేట్ మాజీ ఎమ్మెల్యే పి.ఎస్. ప్రకాష్ పార్టీలో చేరడం ద్వారా కర్ణాటకలో ఉన్న తెలుగు జనాభా మరియు, పవన్ కళ్యాణ్ అభిమాన గణం మద్దతును ఓటు బ్యాంకుగా మార్చుకోవాలని ఆయన భావిస్తున్నారు. ఇది కేవలం ఒక చేరిక మాత్రమే కాదు, కర్ణాటక రాజకీయాల్లో జనసేన ముద్ర వేయడానికి వేసిన తొలి అడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు.పవన్ కళ్యాణ్ ప్రవేశపెట్టిన త్రిశూల్ వ్యూహంలో పార్టీ విస్తరణ ఒక కీలకమైన భాగం. ఈ వ్యూహం ప్రకారం.. పార్టీ కేవలం ఒక వ్యక్తి చరిష్మాపై ఆధారపడకుండా, ఇతర రాష్ట్రాల్లో కూడా క్షేత్రస్థాయి నాయకత్వాన్ని నిర్మించడమే లక్ష్యం. కర్ణాటకలోని బళ్లారి, రాయచూరు, బెంగళూరు వంటి ప్రాంతాల్లో తెలుగు మాట్లాడే ప్రజలు అధికంగా ఉండటం జనసేనకు కలిసొచ్చే అంశం. గతంలోనే కర్ణాటక ఎన్నికల సమయంలో పవన్ నిర్వహించిన ప్రచారానికి వచ్చిన స్పందనను చూసి, అక్కడ సొంతంగా క్యాడర్‌ను నిర్మించుకుంటే భవిష్యత్తులో కింగ్ మేకర్‌గా ఎదిగే

అవకాశం ఉందని ఆయన అంచనా వేస్తున్నారుకేవలం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో భాగస్వామిగా ఉండటమే కాకుండా, దక్షిణాది రాష్ట్రాల్లో ఒక బలమైన ప్రాంతీయ శక్తిగా ఎదగాలన్నది పవన్ దీర్ఘకాలిక లక్ష్యం. సనాతన ధర్మం, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఆయన చేస్తున్న ప్రసంగాలు ఇతర రాష్ట్రాల్లోని యువతను కూడా ఆకర్షిస్తున్నాయి. కర్ణాటకలో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ చేరికతో అక్కడ జనసేన జెండా అధికారికంగా ఎగరడం ప్రారంభమయింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లేదా తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటకలోని కొన్ని స్థానాల్లో పోటీ చేయడం ద్వారా తన సత్తా చాటాలని జనసేనాని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.కర్ణాటక తర్వాత పవన్ చూపు తెలంగాణ , తమిళనాడుపై ఉంది. తెలంగాణలో ఇప్పటికే జనసేనకు బలమైన అనుచరగణం ఉంది, అక్కడ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాలను కూడా ముమ్మరం చేశారు. పొరుగు రాష్ట్రాల్లోని నేతలు జనసేన సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై పార్టీలోకి రావడం అనేది పవన్ కళ్యాణ్ రాజకీయ పరిణతిని , పెరుగుతున్న ఆయన జాతీయ స్థాయి ఇమేజ్‌ను సూచిస్తోంది. ముఖ్యంగా బీజేపీతో ఉన్న మిత్రధర్మం . కేంద్రంలో ఆయనకు ఉన్న ప్రాముఖ్యత ఈ విస్తరణకు మరింత తోడ్పడుతున్నాయి. ఇతర రాష్ట్రాల్లో విస్తరణ అనేది అంత సులభమైన విషయం కాదు. అక్కడ ఇప్పటికే స్థిరపడిన ప్రాంతీయ పార్టీలను, జాతీయ పార్టీలను ఢీకొని నిలబడాలంటే కేవలం అభిమానం సరిపోదు, బలమైన ఆర్థిక వనరులు, క్షేత్రస్థాయి యంత్రాంగం అవసరం. పి.ఎస్. ప్రకాష్ వంటి సీనియర్ నేతల అనుభవం కర్ణాటకలో పార్టీ పునాదులు వేయడానికి ఉపయోగపడవచ్చు. పవన్ కళ్యాణ్ తన సినిమాలను పక్కన పెట్టి పూర్తిస్థాయిలో ఇతర రాష్ట్రాలపై దృష్టి సారిస్తేనే ఈ విస్తరణ కల సాకారమయ్యే అవకాశం ఉందని ఎక్కువ మంది నమ్మకం.

పెన్ పవర్

శనివారం 28 మార్చి 2026

# ఆర్సీబీకి దెబ్బ మీద దెబ్బ: ఆరంభ మ్యాచ్‌కు ముందే మరో స్టార్ బౌలర్ దూరం





**హైదరాబాద్ పెన్ పవర్:** మరికొన్ని గంటల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్ అట్టహాసంగా ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ, సన్ రైజర్స్ హైదరాబాద్ తొలి మ్యాచులో తలపడనున్నాయి. ఈ తరుణంలో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీకి ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ బౌలర్ నువాన్ తుషార టోర్నీ ప్రారంభ మ్యాచుకు దూరమయ్యాడు. ఫిట్‌నెస్ పరీక్షల్లో విఫలం కావడంతో నువాన్ తుషారకు శ్రీలంక క్రికెట్ ఎన్‌ఓసి (చీూజ) నిరాకరించింది. దీంతో అతడు ఐపీఎల్ తొలి మ్యాచుకు అందుబాటులో ఉండే అవకాశం లేకుండాపోయింది. శ్రీలంక క్రికెట్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ యాష్లే డి సిల్వా ఈ విషయాన్ని ధృవీకరించారు. ఐదు వేర్వేరు ఫిట్‌నెస్ పరీక్షల్లో 29 పాయింట్లకు గాను పాస్ స్కోరు (17)ను సాధించడంలో తుషార ఫెయిల్ అయ్యాడని తెలిపారు. దీంతో అతడికి ఐపీఎల్?లో ఆడేందుకు శ్రీలంక క్రికెట్ బోర్డు అతడికి ఎన్వోసీ నిరాకరించింది. ఇప్పటికే ఆర్సీబీ ప్రధాన బౌలర్ యశ్ దయాల్ వ్యక్తిగత కారణాలతో టోర్నీ నుంచి వైదొలిగాడు. మరో స్టార్ పేసర్ హేజిల్‌వుడ్ గాయపడటంతో అతడు ఆడతాడా లేదా అన్న అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఫిట్‌నెస్ సమస్యల కారణంగా నువాన్ తుషార దూరం కావడం ఆర్సీబీకి భారీ ఎదురు దెబ్బేనని అంటున్నారు విశ్లేషకులు. అయితే, మరో ఐదు రోజుల్లో ఫిట్?నెస్ నిరూపించుకునేందుకు అతడికి మరో అవకాశం ఇస్తారు. ఈసారి కూడా ఫెయిల్ అయితే మాత్రం తుషార మొత్తం ఐపీఎల్ టోర్నీకి దూరమయ్యే ఛాన్స్ ఉంది. ప్రారంభ మ్యాచుకు తుషార కూడా దూరం కావడంతో అతడి స్థానంలో న్యూజిలాండ్ స్టార్ పేసర్ జాకబ్ డఫీ బరిలోకి దిగొచ్చు.

# నేటి నుంచే ఐపీఎల్-2026... కొత్త ఫీచర్లతో లైవ్ స్ట్రీమింగ్... ఎక్కడ, ఎలా చూడాలంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. ఈ మెగా టోర్నమెంట్ మార్చి 28న అట్టహాసంగా ప్రారంభం కానుంది. భారత్‌లో ఈ టోర్నమెంట్‌ను స్టార్ స్పోర్ట్స్ ఛానెళ్లలో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. డిజిటల్ ప్రసార హక్కులను దక్కించుకున్న జియోహాట్‌స్టార్ తమ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో మ్యాచ్‌లను లైవ్ స్ట్రీమింగ్ చేయనుంది. ఈసారి జియోహాట్‌స్టార్‌లో ఇంగ్లీష్, హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ భాషల్లోనూ కామెంట్రీ అందుబాటులో ఉంటుంది. అదనంగా బెంగాలీ, భోజ్‌పురి, హర్యానీ భాషల్లోనూ ఫీడ్స్ ఉంటాయి. మొబైల్ యూజర్ల కోసం ప్రత్యేకంగా వర్టికల్ లైవ్ ఫీడ్, 360-డిగ్రీ వ్యూ, మల్టీ-క్యామ్ ఫీచర్లను కూడా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), 2016 విజేత సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్లు తలపడనున్నాయి. రెండు నెలలకు పైగా క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించనున్న ఈ టోర్నీ మే 31న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. ఈ సీజన్‌లో మొత్తం 12 డబుల్ హెడర్ రోజులు ఉన్నాయి. డబుల్ హెడర్ ఉన్న రోజుల్లో మొదటి మ్యాచ్ మధ్యాహ్నం 3:30 గంటలకు, రెండో మ్యాచ్ యథావిధిగా రాత్రి 7:30 గంటలకు ప్రారంభమవుతుంది. సాయంత్రం జరిగే మ్యాచ్‌లకు 7:00 గంటలకు టాస్ వేస్తారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న పది జట్లు గ్రూప్ స్టేజ్‌లో ఒక్కోటి 14 మ్యాచ్‌లు ఆడతాయి. గ్రూప్ స్టేజ్ ముగిసేసరికి పాయింట్ల పట్టికలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్, క్వాలిఫయర్ 2, ఫైనల్ ఫార్మాట్‌లో ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ), గుజరాత్ టైటాన్స్ (జీటీ), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ), ముంబై ఇండియన్స్ (ఎంఐ), పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్లు బరిలోకి దిగుతున్నాయి. ఈ మ్యాచ్‌లను దేశవ్యాప్తంగా 12 ప్రధాన నగరాల్లో నిర్వహించనున్నారు. ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ, అహ్మదాబాద్, హైదరాబాద్, లక్నో, జైపూర్, ధర్మశాల, రాయ్‌పూర్, న్యూ చండీగఢ్ నగరాలు ఈ మెగా టోర్నీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

# రిటైర్మెంట్ వెనక్కి తీసుకున్న విండీస్ స్టార్ ప్లేయర్

**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్ విధ్వంసకర ఓపెనర్ ఎవిన్ లూయిస్ తీసుకున్న యూ-టర్న్ నిర్ణయం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. టీ20 ప్రపంచ కప్ జట్టులో చోటు దక్కలేదన్న ఆవేదనతో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన లూయిస్, ఇప్పుడు మళ్ళీ ప్యాడ్లు కట్టుకుని మైదానంలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాడు.

లూయిస్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడమే కాకుండా, ఒక సంచలన ప్రకటన కూడా చేశాడు. కేవలం వైట్ బాల్ (పరిమిత ఓవర్ల) క్రికెటర్‌గానే ముద్రపడిన అతడు, తొమ్మిదేళ్ల తర్వాత ఇప్పుడు టెస్ట్ క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. ఇందులో భాగంగా ట్రినిడాడ్ అండ్ టొబాగో జట్టు తరఫున నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌తో తన సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించబోతున్నాడు.



**లూయిస్ కెరీర్ హైలైట్స్:**

వన్డేలు: 67 మ్యాచుల్లో 2175 పరుగులు (5 సెంచరీలు).

టీ20లు: 65 మ్యాచుల్లో 1782 పరుగులు (2 సెంచరీలు).

కీలక రికార్డు: అంతర్జాతీయ క్రికెట్‌లో 176 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన ఏకైక ఆటగాడు.

టీ20 స్పెషలిస్ట్: విండీస్ తరఫున టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు (125బి పరుగులు) సాధించిన రికార్డు ఇతడి పేరిటే ఉంది.

# ఫ్లాప్ హీరోయిన్స్ ని పట్టుకున్న అనిల్ రావుపూడి.. ఫేట్ మార్చేనా?

టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ప్రస్తుతం ఒక క్రేజీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై ఫోకస్ పెట్టారు. వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా తెరకెక్కనున్న ఈ సినిమా కోసం అనిల్ ఎంచుకుంటున్న హీరోయిన్ల పేర్లు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యంగా ఫామ్‌లో లేని హీరోయిన్లను తన సినిమాలోకి తీసుకోవడం ద్వారా వారికి మళ్ళీ హిట్ ట్రాక్ ఎక్కించాలని అనిల్ ప్లాన్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. మరి ఈ 'హిట్ మెషీన్' చేతిలో పడ్డాక ఆ ముద్దుగుమ్మల జాతకాలు మారతాయో లేదో చూడాలి.

**వెంకీ సరసన 'మహానటి'.. క్రేజీ కాంబో!:**

ఈ మల్టీస్టారర్ సినిమాలో విక్టరీ వెంకటేష్ సరసన హీరోయిన్‌గా కీర్తి సురేష్ పేరు బలంగా వినిపిస్తోంది. వీరిద్దరూ కలిసి ఇప్పటి వరకు ఒక్క సినిమాలో కూడా నటించలేదు, కాబట్టి ఈ కాంబినేషన్ ప్రేక్షకులకు చాలా కొత్తగా ఉంటుందని అనిల్ రావిపూడి భావిస్తున్నారు. నిజానికి కీర్తి సురేష్‌కు ఈ మధ్య కాలంలో సరైన హిట్లు లేవు. ఇటీవల వచ్చిన 'ఉప్పుకప్పురంబు', 'రివాల్వర్ రీటా' వంటి సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఇలాంటి టైమ్‌లో అనిల్ రావిపూడి సినిమాలో ఛాన్స్ రావడం కీర్తి కెరీర్‌కు ఒక పెద్ద ప్లస్ పాయింట్ అని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

**కల్యాణ్ రామ్ జోడీ ఎవరు? కృతీనా.. కయాదునా?:**

ఇక మరోవైపు ఇదే సినిమాలో నందమూరి కళ్యాణ్ రామ్ సరసన నటించే హీరోయిన్ కోసం ఇద్దరి పేర్లను పరిశీలిస్తున్నారట. ఒకరు 'ఉప్పెన' బ్యూటీ కృతి శెట్టి కాగా, మరొకరు కయాదు లోహర్. కృతి శెట్టి కెరీర్ మొదట్లో వరుస హిట్లు అందుకున్నప్పటికీ, ఈ మధ్య కాలంలో ఆమెకు ఒక్క సాలిడ్ హిట్ కూడా తగలలేదు. అటు కయాదు లోహర్ కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో ఉంది. వీరిద్దరిలో అనిల్ ఎవరిని ఫైనల్ చేసినా, వారికి ఒక అదిరిపోయే కమ్‌బ్యాక్ మూవీ దొరికినట్టేనని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎందుకంటే ఇప్పటికే మీనాక్షి చౌదరి లాంటి హీరోయిన్ కి తన సినిమాల ద్వారా మంచి సక్సెస్ను అందించారు. ప్రస్తుతం ఈమె వరుస సినిమాలలో అవకాశానందుకుంటూ దూసుకు పోతోంది. ఇక ఇప్పుడు మళ్లీ అనిల్ రావిపూడి కొత్త సినిమాలో ఈ హీరోయిన్ల పేర్లు వినిపిస్తున్నాయి. కాబట్టి వీరి ఫేట్ మారుతుంది అనే కామెంట్లు వ్యక్తమవుతున్నాయి





కృతి శెట్టి రీగల్ గ్రీన్ లుక్ ప్యూర్ పర్ఫెక్షన్



సంయుక్త మీనన్ యొక్క బోల్డ్ చీర లుక్ స్పాట్‌లైట్‌ను దొంగిలించింది

**అనిల్ రావిపూడి అంటేనే 'హిట్' గ్యారెంటీ:**

ఇకపోతే అనిల్ రావిపూడి సినిమాలంటేనే మినిమం గ్యారెంటీ ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. పటాస్ నుండి మన శంకర వర ప్రసాద్ వరకు ఆయన ఫ్లాప్ ఎరగని దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. హీరోయిన్లను చాలా ఎనర్జిటిక్‌గా, బబ్లీగా చూపించడంలో అనిల్ స్టైలే వేరు. అందుకే హిట్ కోసం కళ్ళల్లో ఒత్తులు వేసుకుని చూస్తున్న హీరోయిన్లకు అనిల్ సినిమా ఒక గోల్డెన్ ఛాన్స్ అని చెప్పాలి. ఈ సినిమాలో నటించే ఛాన్స్ కొట్టేస్తే, సక్సెస్ ఆటోమేటిక్‌గా వారి ఖాతాలో పడిపోతుందని టాలీవుడ్‌లో ఒక గట్టి నమ్మకం ఉంది.

**2027 సంక్రాంతికి అసలు మజా:**

ప్రస్తుతం ఈ సినిమా ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హీరోయిన్ల విషయంలో ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నా, లీక్ అవుతున్న పేర్లు మాత్రం అంచనాలను పెంచేస్తున్నాయి. 2027 సంక్రాంతి రేసులో నిలవనున్న ఈ మూవీతో వెంకీ, కల్యాణ్ రామ్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తారో చూడాలి. ఫామ్‌లో లేని హీరోయిన్ల ఫేట్ మార్చడంలో అనిల్ రావిపూడి మరోసారి సక్సెస్ అవుతారని అభిమానులు ఆశిస్తున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com